నీలగిరి ఎక్స్ ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

నీలగిరి నిత్యపద్యం
కందం

నీవే హరుడవు శివుడవు
నీవే భక్తుల నిజముగ నిరతము గావన్!
నీవే కరుణా మూర్తివి
నీవే మాకున్ వరముల నిత్తువు దేవా!!

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 200 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 30-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00



## తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు

- ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరికలు చేసిన వాతావరణ శాఖ
- లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం
- వాగులు, కాల్వలు, చెరువుల దగ్గర తిరగవద్దు
- ప్రజలు వాతావరణ సూచనలు పాటించాలని హెచ్చరిక

**హైదరాబాద్,** అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్
తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు పొంచి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖహెచ్చరికలు జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, విదర్భా ప్రాంతాలకు తక్షణ వరద ముప్పు పొంచి ఉందని ఐఎండీ ప్రకటించింది. రాబోయే కొన్ని గంటల్లో ఏపీ,తెలంగాణ, విదర్భా, మరాఠవాడాలో తీవ్ర వర్షపాతం వల్ల వరద వచ్చే ఛాన్స్ ఉందనిపేర్కొంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని, వరద ప్రభావంతో రహదారులపై నీరు వచ్చి -మిగతా 2 లో

# ఐ అలర్ట్

## మొంథా ప్రభావంతో తెలంగాణలో వర్షాలు

### లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలి

- ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయండి
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలో కూడా దాని ప్రభావం తీవ్రంగా ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరం దాటిన తుఫాన్ భద్రాద్రి కొత్తగూడం మీదుగా తెలంగాణలో ప్రవేశించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో వాయుగుండం ప్రభావంపై సీఎం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని.. దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసినందున ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు
-మిగతా 2 లో








## బీహార్‌లో రిమోట్ కంట్రోల్ పాలన

- నితీశ్‌ను ముందు పెట్టి నడుపుతున్న బీజేపీ
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ విమర్శలు

**పాట్నా,**
నీతీశ్ కుమార్‌ను ఎదురుగా పెట్టి బిహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారును నడుపుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని కేంద్రం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని విమర్శించారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే మోదీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముజఫ్ఫర్‌పుర్‌లో నిర్వహించిన తన తొలి ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లోనూ ఇది పునరావృతమవుతుందని ఆరోపించారు. బిహార్ ప్రభుత్వం రిమోట్ కంట్రోల్ ద్వారా నడుస్తోందని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను. భాజపా కేవలం నీతీశ్ కుమార్‌ను వాడుకుంటోంది. దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బిహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఛఠ్ పూజ సందర్భంగా దిల్లీలోని యమునా -మిగతా 2 లో

## స్పామ్ కాల్స్‌కు ఇక చెక్


- మోసపూరిత కాల్స్ సులువుగా గుర్తింపు
- ట్రాయ్ ఆధ్వర్యంలో ట్రూకాలర్ సేవలు




**న్యూఢిల్లీ**
భారత టెలికమ్యూనికేషన్ రంగంలో ఒక కీలక మార్పు రాబోతోంది. ఇకపై కాల్ వచ్చే సమయంలో నంబర్‌తో పాటు కాలర్ పేరు కూడా కచ్చితంగా కనిపించేలా ట్రాయ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పామ్ కాల్స్‌ను అరికట్టే దిశగా కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్ సేవను డీఫాల్ట్ ఫీచర్‌గా ప్రవేశ పెట్టాలని ట్రాయ్ అంగీకరించింది. అక్టోబర్ 28న విడుదలైన ఈ నిర్ణయం ప్రకారం ఇకపై కాల్ చేసిన వారి పేరు నంబర్‌తో పాటు రిసీవ్ చేసుకొనే వ్యక్తికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సేవ అమలుకు సంబంధించిన చర్చలు చాలా కాలంగా కొనసాగుతున్నాయి. సేవ సాధ్యాసాధ్యాలపై సిఫార్సులు ఇవ్వాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం 2022 మార్చిలో ట్రాయ్‌ను సంప్రదించింది. ఆ తర్వాత
-మిగతా 2 లో

## సీఎం, పీఎం సీటు ఖాళీగా లేదు

- తేజస్వీ, రాహుల్‌కు నిరాశ తప్పదు
- బీహార్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా



**పట్నా, అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఎన్డీయే, ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ అధికారాన్ని చేజిక్కించు కోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ అని ఇప్పటికే ప్రకటన రాగా.. ఎన్డీయే ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం స్పష్టత లేదు. దానిపైనే విపక్షాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. దాంతో తాము నీతీశ్ నాయకత్వంలో బిహార్ ఎన్నికలకు
-మిగతా 2 లో

## పాక్ ఆకాశంలో వింత వెలుగులు..

- క్షిపణి ప్రయోగం అని చెబుతుండగా.. మరికొందరు గ్రహాంతరవాసుల వాహనం అంటు నెట్టింట చర్చ



**న్యూఢిల్లీ,**
దాయాది పాకిస్థాన్ ఆకాశంలో వింత వెలుగు దర్శనమిచ్చింది. రంగురంగుల కాంతులతో కూడిన ఈ వింత వెలుగులపై నెట్టింట నెటిజన్లు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. కొందరు ఇది క్షిపణి ప్రయోగం అని చెబుతుండగా.. మరికొందరు గ్రహాంతరవాసుల వాహనం అంటూ మాట్లాడుకుంటున్నారు. అయితే, అది ప్రకృతి సృష్టి అని తేలింది.క్వెట్టా నగరానికి తూర్పున ఉన్న కోహ్-ఎ-ముర్దార్ పర్వతశ్రేణిపై సూర్యోదయానికి ముందు ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సుమారు 20 నిమిషాల పాటూ ఈ కాంతి కనువిందు చేసింది. ఆ తర్వాత అవి కనుమరుగయ్యాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ వింత కాంతిపై నెట్టింట తెగ చర్చ నడుస్తోంది. అయితే, అవి 'లెంటిక్యులర్ క్లౌడ్స్' గా శాస్త్రవేత్తలు తేల్చారు. ఇవి చాలా అరుదుగా వస్తాయని తెలిపారు.

## పెను విపత్తును మిగిల్చిన మొంథా తుపాను

- రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగింది
- ఆస్తి నష్టం చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం
- పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి
- నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకుంటాం
- సత్వర నివేదికలు సిద్ధం చేసి కేంద్రానికి పంపిస్తాం
- పునరావాస కేంద్రంలో ప్రజలను పరామర్శించిన చంద్రబాబు
- ఏరియల్ సర్వే ద్వారా పరిస్థితిని సమీక్షించిన సీఎం



**కోనసీమ,అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
మొంథా తుపాను పెనువిపత్తని.. రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఆయన ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం రోడ్డుమార్గంలో వెళ్లి అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, తుపాను బాధితులను పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, పరిహారం అందించారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడుతూ..మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం.
-మిగతా 2 లో



## రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

- రాష్ట్రపతి ముర్ముతో రఫేల్ రాణి శివాంగీ సింగ్

**న్యూఢిల్లీ,**
రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరంలో దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము భారత వైమానికి దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ముందుగా భద్రతా దళాల నుంచి సైనిక వందనం స్వీకరించారు. ఫ్లైయింగ్ సూట్ ధరించిన రాష్ట్రపతి ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేసారు. ఇందులో యుద్ధ విమాన పైలట్ శివాంగీ సింగ్‌తో దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆమెని బంధించినట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది -మిగతా 2 లో

# మంత్రివర్గంలోకి అజారుద్దీన్

## 31న ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధం



### గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పాచిక
- మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- సీఎం రేవంత్‌తో అజారుద్దీన్ భేటీ



**హైదరాబాద్,** అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పాచిక పన్నుతోంది. ఇంతకాలం కేబినేట్‌లో మైనార్టీలకు చోటుదక్కలేదు. తాజాగా మహమ్మద్ అజరుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. శుక్రవారం తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం జరగనుంది. అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.ఈ మేరకు రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ఇదిలావుంటే -మిగతా 2 లో

## అవసరమైతే తప్ప బయటకు రావద్దు

- వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దు
- పంటల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రభుత్వ సూచనలు పాటించాలి
- అధికారులతో సమీక్షించిన పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్,అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. తుపాను ప్రభావంపై మహబూబాబాద్, ములుగు, అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిస్థితులు సమీక్షిస్తూ అత్యవసర చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పలు రైళ్లు నిలిచిపోయినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తుపాను -మిగతా 2 లో

## ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి..

- భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం : ట్రంప్



**న్యూఢిల్లీ,**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంచి మిత్రులన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీపై ట్రంప్ తాజాగా ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ ఓ మంచి వ్యక్తి అని.. ఆయనలాంటి తండ్రి ఉండాలని అందరూ కోరుకుంటారని వ్యాఖ్యానించారు. టోక్యోలో మంగళవారం వ్యాపారవేత్తలతో జరిగిన డిన్నర్ పార్టీలో ట్రంప్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.'ప్రధాని మోదీ పట్ల నాకు ప్రేమ, గౌరవం ఉన్నాయి. మా మధ్య మంచి స్నేహబంధం ఉంది. ఆయన లాంటి తండ్రి ఉండాలని చాలామంది కోరుకుంటారు. అయితే ఆయన కఠినమైన వ్యక్తి. బలమైన నేత' అంటూ ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్ ప్రస్తావించారు. భారత్‌తో అతి -మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు

మొదటి తరువాయి

చేరవచ్చని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీర ప్రాంతమైన యానంతో పాటు గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఈ ముప్పు పొంచి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్గిరి, పెద్దపల్లి జిల్లాలకు ఈప్రమాదం పొచివుంది. మరాఠవాడా సమీప ప్రాంతాలలైన నాందేడ్, హింగోలి, పర్భణీ. విదర్భా ప్రాంతం కూడా ఫ్లాష్ఫ్లడ్ హెచ్చరికలో ఉన్నాయి. బుల్దానా, అకోలా, అమరావతి, వార్ధా, యవత్మాల్, నాగ్పూర్ జిల్లాలకు ఎ÷-లాష్ ఫ్లడ్ హెచ్చికలు జారీ అయ్యాయి. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లొదని.. వాగులు, కాల్వలు, చెరువుల దగ్గర తిరగవద్దని ఐఎండీ హెచ్చరించింది. ప్రయాణం ముందు వాతావరణ సమాచారం తెలుసుకోవాలని సూచించింది. రైతులు పంటలు, పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని.. స్థానిక అధికారులు అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో ఆయా జిల్లాల డిజాస్టర్ కంట్రోల్ రూమ్, స్థానిక సహాయ కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచనలు చేసింది. ఐఎండీ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నుంచి జారీ అయ్యే తాజా సమాచారం తప్పకుండా పాటించాలని భారత వాతవారణ శాఖ పేర్కొంది.

# బీహార్‌లో రిమోట్ కంట్రోల్ పాలన

మొదటి తరువాయి

నది ఘాట్ వద్ద పూజలు చేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. ఆ తర్వాత అది కృత్రిమంగా నిర్మించిందని తెలుసుకుని వెనకడుగు వేశారని రాహుల్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఎంతకైనా వెళ్తారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. బిహార్ లో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రజలు తమ సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆధునిక నలంద విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ హయాంలోనే నాంది పడిందన్నారు. భవిష్యత్తులో అమెరికన్లు సైతం తమ ఉన్నత విద్య కోసం ఇక్కడి వస్తారని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తామని ఆర్జేడీ నేత, 'మహాగఠ్‌బంధన్' సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఇటీవల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో తీసుకున్న అనేక ప్రజాకర్షక చర్యలు.. గతంలో తాను ఇచ్చిన హామీలకు నకలు అని విమర్శించారు. బయటి వ్యక్తుల నియంత్రణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. అవినీతి, శాంతిభద్రతలపై రాజీలేని వైఖరిని అవలంబిస్తానని తెలిపారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా ఖండించింది. ఆయన వీధి రౌడీలా మాట్లాడారంటూ మండిపడింది. ప్రధానికి ఓటు వేసిన ప్రతి వ్యక్తిని ఆయన అవమానించారు. ఓటర్లను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. కాంగ్రెస్, రాహుల్ గాంధీ చొరబాటుదారులకు బహిరంగంగా అండగా నిలుస్తున్నారని దుయ్యబట్టింది.

# సీఎం, పీఎం సీటు ఖాళీగా లేదు

మొదటి తరువాయి

వెళ్తామని ఇటీవల మోదీ ప్రకటించారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని తాజాగా అమిత్ షా స్పష్టంచేయడంతో ఎన్డీయే సీఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై ఉన్న సందిగ్ధత వీడిపోయింది. ఈ క్రమంలో రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని వ్యాఖ్యానించారు. బిహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఆర్జేడీపై ఆయన వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమారుడు తేజస్వీయాదవ్‌ను ముఖ్యమంత్రిని చేయాలను కుంటున్నారని, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని పీఎంను చేయాలనుకుంటున్నారని అమిత్ షా విమర్శించారు. కానీ ఆ రెండు స్థానాలు ఖాళీగా లేవంటూ మహాగఠ్‌బంధన్ పార్టీలను ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి.. రాష్ట్ర ప్రతిష్ఠను పెంచారని ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్‌షా వ్యాఖ్యానించారు. అలాగే పహల్గాం దాడి గురించి ప్రస్తావించారు. ఆ ఉగ్రదాడి జరిగిన వెంటనే మోదీ ఆపరేషన్ సిందూర్‌కు ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు.

# స్పామ్ కాల్స్‌కు ఇక చెక్

మొదటి తరువాయి




2024 ఫిబ్రవరిలో ట్రాయ్ తన తొలి సిఫార్సులను సమర్పించగా.. 2025 సెప్టెంబరులో ఆని పునఃపరిశీలన కోరింది. ఈ నేపథ్యంలో ట్రాయ్ తాజాగా ఇచ్చిన సమాధానంలో ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకుని కొన్ని కీలక మార్పులతో తన మునుపటి సిఫార్సులను పునరుద్ధరించింది. ఈ సేవ ప్రధానంగా మోసపూరిత, స్పామ్ కాల్స్‌ను అరికట్టడమే లక్ష్యంగా దశలవారీగా ప్రవేశపెట్టబడుతుంది. ఇది అన్ని వినియోగదారులకూ డీఫాల్ట్‌గా యాక్టివ్‌గా ఉంటుంది. కానీ, అవసరమైతే ఆప్షనల్‌గా డిసేబుల్ చేసుకునే అవకాశం ఉంటుంది. వినియోగదారుల పేర్లు ఐజఅ ధృవీకరించిన వివరాల ఆధారంగా చూపిస్తాయి. లైసెన్సింగ్ నియమాల్లో కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ నిర్వచనాన్ని విస్తరించి.. కాలింగ్ నేమ్ ను కూడా చేర్చనున్నారు. గోప్యత రక్షణలో భాగంగా.. అఐఎఖీ ఎంచుకున్న వినియోగదారుల పేర్లు మాత్రం ప్రదర్శించబడవు. వ్యాపార వినియోగదారులు తమ ట్రేడ్ నేమ్ లేదా ట్రేడ్‌మార్క్‌ను కాలర్ ఐడెంటిటీగా చూపించుకునే వీలు ఉంటుంది. కానీ, అది ప్రభుత్వ ధృవీకరణ పక్రియకు లోబడి ఉంటుంది. అలాగే కొత్త మొబైల్ పరికరాల్లో ఫీచర్ తప్పనిసరిగా ఉండేలా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తో సమన్వయం చేయాలని ట్రాయ్ ప్రకటించింది. ఈ సేవను అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం మార్గదర్శకాలకు అనుగుణంగా సప్లిమెంటరీ సేవగా వర్గీకరించారు. ట్రాయ్ తాజా నిర్ణయం మేరకు టెలికాం ఆపరేటర్లకు ఒక వారంలో కనీసం ఒక సర్కిల్‌లో సేవ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత 60 రోజుల పైలట్ దశ పూర్తి చేసిన అనంతరం దేశవ్యాప్త రోల్‌అవుట్ జరగనుంది.

# బీ అలర్ట్

మొదటి తరువాయి

కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాటు.. హైదరాబాద్, ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గోల్కొండ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దారి మళ్లించినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని... కలెక్టర్లు ఆయా బృందాలకు దిశా నిర్దేశర చేయాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని.. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించా లన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాల న్నారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# మంత్రివర్గంలోకి అజారుద్దీన్

మొదటి తరువాయి



తాజాగా అజారుద్దీన్‌ను సిఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకోవడం, వార్తలకు బలం చేకూరింది. తనకు మంత్రి పదవి ఇవ్వాలన్న నిర్ణయంపై ధన్యవాదాలు తెలిపినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక పక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే బిసి రిజర్వేషన్లపై కసరత్తు జరుగుతున్న వేళ కేబినేట్‌లో బిసిల కోటాను పెంచాలని డిమాండ్ వచ్చింది. దీనిని కాంగ్రెస్ పట్టించుకున్నట్లు లేదు. మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెష్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో.. త్వరలో కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల్లో అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగు తున్నట్టు తెలుస్తోంది. దీంతో బిసి సామాజిక వర్గాలు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బీర్ల అయిలయ్యలు ఎప్పటి నుంచో మంత్రిపదవికి డిమాండ్ చేస్తున్నారు. అజారుద్దీన్ రాకతో ఇప్పుడు హైదరాబాద్‌కు చోటు దక్కినట్లు కానుంది.

# రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

మొదటి తరువాయి

పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్‌కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలట్‌ను బంధించామని పాక్ అబద్ధాలు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగీ సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇప్పుడు ఆమెతో రాష్ట్రపతి ముర్ము ఫొటో దిగడంతో శివాంగీ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె కోసం నెటిజన్లు శోధిస్తున్నారు. సింగ్ స్వస్థలం వారణాసి. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం లో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌సీసీలో చేరారు. ఆపై 2016లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనం నుంచీ పక్షిలా ఆకాశంలో ఎగరాలని కలలు కన్న ఆమె.. ఎప్పటికైనా పైలట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ యుద్ధ విమాన పైలట్లుగా నియమితులైన మోహనా సింగ్, భావనా కాంత్, అవనీ చతుర్వేది స్ఫూర్తితో పైలట్‌గా శిక్షణ తీసుకున్నారు. 2017లో రెండో దశ యుద్ధ విమాన పైలట్లలో ఒకరిగా ఎంపికైన శివాంగీ.. మిగ్-21 బైసన్ యుద్ధ విమానాలు నడపడంలో ప్రావీణ్యం సాధించారు. మిగ్ ఫైటర్ జెట్లు నడిపిన అనుభవంతోనే 2020లో దేశంలోనే అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం దక్కించుకున్నారు. అప్పటి నుంచి అంబాలా ఎయిర్‌బేస్‌లోని 'గోల్డెన్ యారోస్' స్క్వాడ్రన్ బృందంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2022లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 'భవిష్యత్తు కోసం భారత వైమానిక దళం రూపాంతరం చెందుతోంది' అనే థీమ్‌తో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శకటాన్ని ప్రదర్శించింది. ఈ శకటంలో రఫేల్ ÷టైర్ జెట్ యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శకటంపై శివాంగి సింగ్ సెల్యూట్ చేస్తూ కనిపించారు. గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న రెండో పైలట్‌గా ఘనత సాధించారు. ఆ సమయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా 'రఫేల్ రాణి' అంటూ చేసిన పోస్ట్ ఆకట్టుకుంది.

# అవసరమైతే తప్ప బయటకు రావద్దు

మొదటి తరువాయి

ప్రభావం తగ్గే వరకు ప్రజలు.. ప్రభుత్వ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీతక్క దిశానిర్దేశం చేశారు. తుఫాను పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అత్యావసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మంత్రి సీతక్క మాట్లాడారు. తుఫాను కారణంగా అధికారులు చేపట్టిన చర్యలపై మంత్రి సీతక్క తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్గనిర్దేశర చేశారు. పశువుల కాపరులు తమ పశువులని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం అందుతున్న క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు వంటి అవసరాలు వెంటనే అందించాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి సీతక్క సూచించారు.

# పెనువిపత్తును మిగిల్చిన మొంథా తుపాను

మొదటి తరువాయి



గతంలో తుపానుల సమయంలో పనిచేసిన అనుభవం నాకు ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం లేకుండా చూశాం. ఆస్తి నష్టం కూడా చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం. పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షం నమోదైంది. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం. కౌలు రైతులకు పరిహారం అందిస్తాం. మత్స్యకారులు, చేనేత కార్మికులకు అదనంగా 50 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నాం అని సీఎం తెలిపారు. మొంథా తుఫాను ప్రభావం వల్ల ఏపీలో పలు జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తుఫాను కారణంగా చేతికి అందివచ్చిన పంట పాడైపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మొంథా తుఫాను వల్ల జరిగిన ప్రాథమిక నష్టాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే రెండు రోజుల్లో అధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో శరవేగంగా అధికారులు పంట నష్టంపై వివరాలు తెలుసుకుంటున్నారు. అయితే, ప్రాథమిక అంచనాలు వచ్చాక కేంద్ర ప్రభుత్వానికి నివేదించనుంది ఏపీ ప్రభుత్వం. 249 మండలాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాను ప్రభావం ఉందని అధికారులు గుర్తించారు. మొంథా తుఫానుతో ఏపీలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని అధికారులు తెలిపారు. మొంథా తుఫానుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పంట నష్టంపై అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. జిల్లాలో పంటలు భారీగా దెబ్బతిన్నాయని చెప్పుకొచ్చారు. 10 వేల హెక్టార్లలో వరిపంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. 5 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం కలిగినట్లు అధికారులు గుర్తించారు. అలాగే, రెండు వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు నీట మునిగాయని అధికారులు తెలిపారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితుల కోసం ప్రోటోకాల్‌ను పక్కనపెట్టారు. సీఎం కాన్వాయ్ వెహికల్‌లో కాకుండా ఇన్నోవా కారులోనే బాధితుల వద్దకు వెళ్లారు. సాధారణ వాహనంలోనే బాధితుల దగ్గరకు వెళ్లారు. అల్లవరం మండలంలోని ఓడరేవుల సమీపంలో ఉన్న పునరావాస శిబిరాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. పునరావాస బాధితులకు 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. దాదాపు అరగంట సేపు పునరావాస శిబిరంలోనే గడిపారు. పునరావాస శిబిరంలో వసతుల కల్పనపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. అరగట్ల పాలెం, బెండమూరు లంక గ్రామాల్లో నీట మునిగిన పొలాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు.

# ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి..

మొదటి తరువాయి

త్వరలోనే వాణిజ్య ఒప్పందం జరగనున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అంతేకాదు, పాకిస్థాన్-భారత్ మధ్య మొదలైన యుద్ధానికి వాణిజ్యంతో బ్రేక్ వేసినట్లు ట్రంప్ తెలిపారు.

**2025 అక్టోబర్ 30, గురువారం తెలుగు పంచాంగం**



## నేటి పంచాంగం

మాసం పక్షం
కార్తీక మాసం
శుక్ల పక్షం
తిథి
దశమి: అక్టోబర్ 29 రా. 12:26 అక్టోబర్ 30 రా. 1:21 వరకు
ఏకాదశి: అక్టోబర్ 30 రా. 1:21 అక్టోబర్ 31 రా. 2:14 వరకు
నక్షత్రం
శతభిషం: అక్టోబర్ 29 రా. 9:14
అక్టోబర్ 30 రా. 9:46 వరకు
పూర్వభాద్ర: అక్టోబర్ 30 రా. 9:46
అక్టోబర్ 31 రా. 10:23 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:50 - 5:34
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:36 - 12:20
అమృతకాలం: మధ్యాహ్నం 3:18 - 5:02
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 1:39 - 3:08
యమగండం: ఉదయం 6:18 - 7:47
గుళికా: ఉదయం 9:16 - 10:45
దుర్ముహూర్తం: ఉదయం 10:18 11:07,
మధ్యాహ్నం 2:57 - 3:45
వర్జ్యం: రాత్రి 8:32 - 10:10

# తెలంగాణ తాజా మాజీ సర్పంచుల పనితీరు దేశానికి ఆదర్శం

-గ్రామపంచాయతీల అభివృద్ధికి సొంత ఆదాయ వనరులు కీలకం
-తాజా మాజీ సర్పంచులకు ఎన్ఐఆర్డి ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల అధికారుల ప్రశంసలు
-రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి



**కద్దాల్, అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
గ్రామపంచాయతీల అభివృద్ధి సొంత ఆదాయ వనరులపై ఆధారపడి ఉంటుందని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు.జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖ,రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో వికాస్ ఆడిటోరియంలో హర్యానా,మహారాష్ట్ర,జారండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన పంచాయతీరాజ్ సీనియర్ అధికారులతో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ లో లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు.తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ద్వారా గ్రామపంచాయతీకి ఉన్న వివిధ అధికారాలు, వినియోగాల గురించి వివరించినట్లు తెలిపారు.గ్రామపంచాయతీ ద్వారా సొంత ఆదాయ వనరుల పెంపులో భాగంగా ఇంటి పన్ను,వినోదపు పన్ను,వారాంతపు సంత,వృత్తి వ్యాపార లైసెన్సుల మంజూరి ద్వారా వచ్చే వివిధ ఆదాయ వనరుల వివరాలు మరియు పన్నుల వసూలుకు తీసుకున్న జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది అధికారులు మరియు కన్సల్టెంట్లు పాల్గొన్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో పాటు సొంత ఆదాయ వనరుల కూర్పు కూడా చాలా ముఖ్యమని తెలిపినట్లు అన్నారు.అదేవిధంగా గ్రామపంచాయతీల అభివృద్ధి పాలకవర్గం సమిష్టి కృషి మరియు ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని అన్నారు.తెలంగాణలో తాజా మాజీ సర్పంచులు చేసిన అభివృద్ధికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని తదనుగుణంగానే రాష్ట్రానికి ఎన్నో జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు అందాయని తెలిపారు.తాజా మాజీ సర్పంచుల పనితీరును వివిధ రాష్ట్రాల అధికారులు ప్రశంశించినట్లు,తెలంగాణ గ్రామాలలో జరిగిన అభివృద్ధి దేశానికి రోల్ మాడల్ అని కితాబునిచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు ప్రొఫెసర్లు దిలీప్ కుమార్ పాల్, అంజన్ కుమార్ బాంజియా,అన్నా దొరై,అజిత్ కుమార్,ఆశాలత, ఉపేందర్,రాజేందర్,విద్యులత తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

# అమ్రాబాద్ ప్రజలకు రెడ్ అలర్ట్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అచ్చంపేట నియోజకవర్గం, నాగర్‌కర్నూల్ జిల్లా అంతటా వర్షాలు ఉధృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. అమ్రాబాద్ మండలంలో 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. వర్షపాతం 98.8 మిల్లీమీటర్లు నమోదైంది.ప్రజల ప్రాణభద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, శిథిల గృహాలు, మట్టి ఇండ్లలో నివసించే వారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. విద్యుత్ స్తంభాలు, చెరువులు, వాగులు వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ప్రవహిస్తున్న ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు.అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఉర్దూ స్కూల్ సమీపంలో ట్రాన్స్ఫార్మర్ కాలిపోయింది. కుమ్మరోనిపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మద్దిమడుగు వెళ్ళే బస్సులు, వాహనాల రాకపోకలు నిలిపివేయబడ్డాయి. ప్రజల రక్షణ కోసం రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు."ప్రజల ప్రాణాలు మాకు ప్రథమం. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితిని అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు.

# నేడు కామ్రేడ్ సాయిలన్న 41వ వర్ధంతి



**అమ్రాబాద్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమరుడు కామ్రేడ్ సాయిలన్న 41వ వర్ధంతి సభ నేడు 11:30 గంటలకు అమ్రాబాద్ మండల కేంద్రంలోని సాయిలన్న స్థూపం వద్ద నిర్వహించనున్నారు. 1962 ఫిబ్రవరి 1న మల్లమ్మ రాములు దంపతులకు జన్మించిన సాయిలన్న, నిరుపేద కుటుంబంలో పెరిగి, విద్యాభ్యాసం చేస్తూనే సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం సాగించారు. సమాజంలో జరుగుతున్న దోపిడీకి గళమెత్తి, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు. 1984 అక్టోబర్ 30న కొంతమంది మతోన్మాదులు కిరాయిగుండాల చేత ఆయనను హత్య చేశారు. భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజల మనస్సుల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రజా ఉద్యమాలకు ప్రాణం పెట్టిన సాయిలన్న సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయనకు నివాళులర్పించేందుకు బంధుమిత్రులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.ఈ సభను సాయిలన్న అభిమాన సంఘం, సిపిఐ, అంబేద్కర్ సంఘం, యురేనియం వ్యతిరేక జేఏసీ నేతలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ప్రజా ఉద్యమాలకు అంకితమైన సాయిలన్నను మరోసారి స్మరించుకునే ఈ వేదిక, ప్రజాస్వామ్య విలువలకు అద్దం పడనుంది.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నర్సారెడ్డి

హస్తం గుర్తుకే ఓటు వేసి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించండి - ప్రజలకు పిలుపు



**హైదరాబాద్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రహమత్ నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "హస్తం గుర్తుకే ఓటు వేసి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి. ప్రజల సమస్యలకు పరిష్కారం కలిగించే నాయకత్వం అవసరం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలపడం ద్వారా ప్రజా సంక్షేమానికి బలమైన మద్దతు ఇవ్వగలుగుతారు" అని పేర్కొన్నారు.ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మర్రికుంట ఆలుగు నిర్మాణం పై ఆగ్రహం వ్యక్తం చేసిన దుప్పల్లి నారాయణ

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో 80% కేంద్ర ప్రభుత్వ నిధులు -అయ్యగారి ప్రభాకర్ రెడ్డి



**వనపర్తి, అక్టోబర్ 29( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తుప్పల్లి నారాయణ అధ్యక్షతన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ః
"ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చూపడం ప్రతిపక్షాల బాధ్యత. మర్రికుంటలో అలుగు నిర్మాణంలో జరుగుతున్న తప్పుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నిర్లక్ష్యాన్ని నిరసన రూపంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాము. బీజేపీ పబ్లిసిటీ కోసం కాదు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుంది," అని తెలిపారు.ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ః "ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 80 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వవే. మూడు లక్షల 80 వేల ఇండ్లకు కేంద్రం నిధులు ఇస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం కృతజ్ఞతలు చెప్పకుండానే ఆ ఇళ్లు తమవే అన్నట్టుగా ప్రచారం చేస్తోంది. ప్రతి ఇందిరమ్మ ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం వాటా ఏంతుందో ప్రజలకు ఆధారాలతో చూపిస్తాం," అని అన్నారు.

**అలాగే ఆయన మాట్లాడుతూ**
"కేంద్ర ప్రభుత్వం పట్టణ గ్రామీణ అభివృద్ధికి విస్తృతంగా నిధులు విడుదల చేస్తోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా విడుదల చేయక అభివృద్ధిని అడ్డుకుంటోంది. సొసైటీలు, గృహ యోజనల నిధులు కూడా కేంద్రం పంపినా రాష్ట్ర ప్రభుత్వం వారి వాటాను కేటాయించకుండా నిధులు వెనక్కి పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు
ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్,పురుషోత్తం రెడ్డిలు,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ తిరుమలేష్, పట్టణ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మున్సిపల్‌కు మహర్దశ

-పట్టణ అభివృద్ధికి 62.23 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే విజయ రమణారావు



**పెద్దపల్లి, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి మున్సిపల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 732 ద్వారా 62 కోట్ల 23 లక్షలు మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చింతకుంట విజయ రమణారావు తెలిపారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా మంజూరైన ఈ నిధులతో ఎనిమిది ప్యాకేజీల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు.జిల్లా కేంద్రమైన పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. అడిగిన వెంటనే నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తాం. ప్రజల సహకారం అవసరం" అని ఎమ్మెల్యే విజయ రమణారావు పేర్కొన్నారు.

# అన్నదాతలకు ఆందోళన అవసరం లేదు

**-చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం**
**-వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు.వనపర్తి జిల్లా పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. జిల్లా మొత్తంలో మొదటి విడతగా 396 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో మహిళా సంఘాల ద్వారా 170, పీఏసీఎస్ ల ద్వారా 218, మెప్మా ద్వారా 8 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారుఈ సందర్భంగా బుధవారం పెద్దమందడి మండలం వెల్టూరు, చిట్యాల సమీపంలోని వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన



ప్రారంభించారు.కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, రఘుపతిరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణ, వైద్యులు పగిడాల శ్రీనివాస్ రెడ్డి, ఎత్తం రవి, లక్కాకుల సతీష్, గోపాల్పేట ఉమ్మడి మండలాల ఇంచార్జ్ సత్యశీలారెడ్డి, పట్టణ మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల అప్రమంతంగా ఉండండి

**పలు కాలనీలను సందర్శించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన మున్సిపల్ కమీషనర్ మహెమూద్ షేక్**

**కల్వకుర్తి, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తున్నందున పలు కాలనీలు వార్డులలో విద్యానగర్ కాలనీలో గాంధీనగర్ కాలనీ లో, ఎల్లికల్ రోడ్డు నందు పర్యటించి వర్షపు నీరు అధికంగా ఉన్న చోట సిబ్బంది సహాయంతో నీరును పక్కకు మళ్లించారు పలుచోట్ల మరమ్మత్తులు చేపట్టారు. మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇట్టి విషయంలో పట్టణంలో భారీ వర్షం కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలను కోరడం జరిగింది. పట్టణ పరిధిలో తాత్కాలిక నిర్మాణాలు లేదా పాడుబడ్డ భవనాలకు,విద్యుత్ స్తంబాలకు,పరికరాలకు దూరంగా ఉండాలని, కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లలో ఉండకూడదని మరియు ప్రజలకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పురపాలక సంఘం
అత్యవసర టీంలకు ఫోన్ ద్వారా సంప్రదించాలని తెలియజేశారు










1. రంగన్న, సానిటరీ ఇన్స్పెక్టర్ 9059549095
2. శివ, EE, 8184893646
3. యం. రాజు, జవాన్, 8341953311
4. B. శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ 9494271888
5. అందరూ పారిశుధ్య జవాన్లు

అదేవిదంగా, భారీ వర్షం కురుస్తున్నందున మున్సిపల్ సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు.

# వాసవి, వనిత క్లబ్‌ల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**ఎల్బీనగర్ ,అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** సేవా కార్యక్రమాలు సమాజంలో శాశ్వ తంగా నిలిచేలా ఉండాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ సరాబు అనంతం గుప్త అన్నారు . బుధవారం కర్మన్ ఘాట్ లోని నాగబండి రాములు గుప్త కన్వెన్షన్ హల్ లో కర్మన్ ఘాట్ వాసవి వనిత క్లబ్ నూతన అధ్యక్షురాలు గా గోవిందు అనిత శ్రీనివాస్ గుప్త , ప్రధాన కార్యదర్శి పానుగంటి అనురాధ , ట్రెజరర్ భాస్కర్ వార్ సంధ్య వాసవి క్లబ్ గవర్నర్ సరాబు అనంతం గుప్త ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గవర్నర్ సరాబు అనంతం గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సామూహిక శక్తికి, సేవకు వాసవి క్లబ్ దోహదపడుతుందన్నారు. సేవా కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. నూతన అధ్యక్షురాలుగోవిందు అనిత శ్రీనివాస్ మాట్లాడుతూ వాసవి వనిత క్లబ్ లో సభ్యులను చేర్పించడంతోపాటు వనిత క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తనను కర్మన్ ఘాట్ వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలుగా ఎంపిక చేసినందుకు సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపారు.







ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవా అధ్యక్షులు బచ్చు మహేష్ గుప్తా, బచ్చు మంజుల, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కొందూరు రాధిక, కోశాధికారి తెరెటిపల్లి విజయలక్ష్మి, నీలా విజయలక్ష్మి, బందారు మోహనమ్మ, తాడేపల్లి మానస ,చీకటిమల్ల కవిత, భవనగిరి కవిత, బందారు పద్మ, గార్లపాటి పురుషోత్తం, బిజ్జాల స్వాతి, కొందూరు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అధికారిగా గరీమ అగ్రవాల్ సేవలు ప్రశంసనీయం

**బదిలీ సందర్భంగా కలెక్టరేట్‌లో ఘన సన్మానం**

**సిద్ధిపేట, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజన్న సిరిసిల్ల జిల్లాకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా బదిలీపై వెళ్లిన గరీమ అగ్రవాల్‌కు మంగళవారం సాయంత్రం సిద్ధిపేట కలెక్టరేట్‌లో ఘన సన్మానం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ కే.హైమావతి మాట్లాడుతూ, "గరీమ అగ్రవాల్ పరిపాలనలో నిబద్ధత, సామర్థ్యం, ప్రజల పట్ల సేవా దృక్పథం ప్రశంసనీయం. ఆమె ఎప్పుడూ ఉత్తమ అధికారిగా ముందుంటారు" అని




పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇండ్లు, వనమహోత్సవం, ఎన్నికల ప్రిపరేషన్, మంత్రుల పర్యటన వంటి కార్యక్రమాల్లో ఆమె పాత్ర కీలకమని తెలిపారు. గరీమ అగ్రవాల్ మాట్లాడుతూ, "సిద్ధిపేట జిల్లాలో వృత్తిపరంగా, వ్యక్తిగతంగా మర్చిపోలేని అనుబంధం ఏర్పడింది. ప్రజలతో, అధికారులతో పనిచేయడం గొప్ప అనుభూతి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆమె సేవలను కొనియాడారు.

# జనజీవనానికి ఆటంకం లేకుండా తక్షణ చర్యలు తీసుకోండి

**అధికారులను ఆదేశించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కల్వకుర్తి, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల జనజీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే 24 గంటల్లో నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బుధవారం నాడు అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యుత్తు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి శాఖలతో సమన్వయం చేసుకుంటూ రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలని, వాగులు, కాల్వలు, చెరువుల వద్ద పోలీసులతో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. స్థానిక అధికారులు అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలవాలి


**సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు పిలుపు**



**మనోహరాబాద్, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి తల్లిదండ్రులు చిట్కుల లక్ష్మి, రాంరెడ్డి జ్ఞాపకార్థంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో 190 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని మూడు అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులకు కుర్చీలు, ఆడుకునే వస్తువులు, ప్లేట్లు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మనమందరం అండగా నిలవాలి. అన్ని ప్రభుత్వమే చేస్తుంది అని అనుకోకుండా, సామాజిక బాధ్యతగా మనవంతు చేయాలి" అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశిధర్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు జావేద్ పాషా, అనిల్, ధర్మేంద్ర, శంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. మహిపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# తెలంగాణ జాగృతి గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా లవకుమార్

**కావాడిగుడ, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ జాగృతి రాష్ట్ర గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులుగా బండ మైసమ్మకు చెందిన సిహెచ్. లవకుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని జాగృతి కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కవితను మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ, "సంస్థ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలి. రాష్ట్రవ్యాప్తంగా జాగృతి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు లవకుమార్ వంటి యువ నాయకులు ముందుకు రావాలి" అని పేర్కొన్నారు.లవకుమార్ మాట్లాడుతూ, "జాగృతి అధ్యక్షురాలు కవిత మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను బలోపేతం చేయడానికి కృషి చేస్తాను" అని తెలిపారు.



# జన్మభూమి కాలనీలో పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**అల్విన్ కాలనీ,అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జన్మభూమి కాలనీలో డ్రైనేజ్, సీసీ రోడ్ల సమస్యలపై కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాదయాత్ర నిర్వహించారు. కాలనీ వాసులు వినిపించిన సమస్యలను స్వయంగా పరిశీలించిన ఆయన, ఇప్పటికే మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.మూడువందల మీటర్ల డ్రైనేజీ లైన్ శాంక్షన్ అయిందని, నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. నిర్మాణ దశలో ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డ్రైనేజీ పనులు పూర్తయిన అనంతరం సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శివ, రెహ్మాన్, నాగరాజు, బాలకృష్ణ, రాము, బీముడు, మహేష్, తిరుపతి, రామకృష్ణ, ప్రవీణ్, పెద్ద రాజు, సోమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి

జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపు



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని అక్టోబర్ 31న ఘనంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1920 అక్టోబర్ 31న లాలా లజపతిరాయ్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ స్థాపించబడిందని, అప్పటి నుంచి కార్మిక హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం సాగిస్తున్న ఘన చరిత్ర ఆ సంస్థకు దక్కిందని పేర్కొన్నారు.జిల్లా కేంద్రంతో పాటు హమాలి అడ్డాలు, ఆటో కార్మికుల కేంద్రాలు, ఐఎంఎఫ్ఎల్ డిపోలు, వివిధ సంఘటిత అసంఘటిత రంగాల్లో జెండాలు ఎగురవేసి కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలను నిర్వహించాలని సూచించారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, ఔట్‌సోర్సింగ్ విధానాల రద్దు వంటి అంశాలపై ఏఐటీయూసీ ఎన్నో జాతీయ, రాష్ట్ర స్థాయి సమ్మెలు నిర్వహించి ప్రభుత్వాలను న్యాయబద్ధమైన నిర్ణయాలకు ఒప్పించిందని వివరించారు.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఏఐటీయూసీ, నేటికీ కార్మికుల చైతన్యానికి మార్గదర్శిగా నిలుస్తోందని మారేడు శివశంకర్ పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, జిల్లా కేంద్రం అంతటా ఆవిర్భావ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటన

-ప్రజలు ఆందోళన చెందవద్దు

- ప్రభుత్వం అండగా ఉంటుంది



**అచ్చంపేట, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా అచ్చంపేట నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించేందుకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట శాసన సభ్యులు డా. చిక్కుడు వంశీకృష్ణ చారకొండ మండలంలోని తుర్కలపల్లి గ్రామంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంపీఓ, డీఈ, పోలీస్ అధికారులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ప్రజలతో, అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే వంశీకృష్ణ, “ప్రజలు ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. ముంపు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన రక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలి” అని సూచించారు.వివిధ వాగుల్లో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు చెరువులు, వాగులు ప్రవహిస్తున్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిథిల గృహాలు, మట్టి ఇండ్లలో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని, విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు ఇప్పటికే సహాయక చర్యలు చేపడుతున్నారని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

# జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-కలెక్టర్ ఇలా త్రిపాఠి

-అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదు



**నల్లగొండ ,అక్టోబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రం మొదలుకొని గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందరూ వారి వారి కార్య స్థానాల్లో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బుధవారం ఆమె మొంథా తుఫాన్ ప్రభావం పై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు . ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఎవరు సాధ్యమైనంత వరకు ఇళ్లనుండి బయటకు రావద్దని, అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని చెప్పారు. రైతులు పొలం పనుల నిమిత్తం పొలాలకు వెళ్ళవద్దని, అలాగే పంట కోతలు చేయవద్దని, పొలాలకు వెళ్లిన సమయంలో వాన నీటిలో పాముకాటు గురయ్యే అవకాశం ఉందని ,అలాగే పిడుగుపాటు,ఇతర ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటన్నిటి నుండి సురక్షితంగా ఉండేందుకు ఇళ్లలో ఉండాలని చెప్పారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వర్షం వల్ల తడిసి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండకుండా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అలాంటి ఇండ్లను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వర్షాల నేపద్యంలో పాఠశాలలకు, అంగన్వాడీలకు సెలవు ప్రకటించడం జరిగిందని, అయినప్పటికీ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు,, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కడగకుండా సంబంధిత ఆర్సివోలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా పాఠశాలల్లో పారిశుధ్య,ఆరోగ్య సమస్యలు, విద్యుత్ ప్రమాదాలు,ఇతర సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పశు వులను పొలాల్లోకి వదల వద్దని, అలా వెళ్లడం వల్ల పిడుగుపాటుకు పశువులు చనిపోయే ఆస్కారం ఉందని తెలిపారు. వర్షాలనేపద్యంలో ప్రజలుప్రత్యేకించి యువత వాగులు, వంకలు, నదుల వద్దకు ఈత కొట్టేందుకు,బట్టలు ఉతికేందుకు, చేపలు పట్టేందుకు ఎవరు వెళ్ళవద్దని, అలాగే లోతట్టు కాజ్ వేలు, పొంగి ప్రవహించే బ్రిడ్జిలు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ఆదేశించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని దాన్యం, పత్తి కోతలు చేయవద్దని రైతులను కోరారు. అలాగే కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం ,పత్తి పంటలు తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా టార్పాలిన్లు కప్పి ఉంచాలని అన్నారు .ఎక్కడైనా రహదారులు దెబ్బ తిన్న ,కోతకు గురైన, తెగిపోయిన, గుంతలు పడిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఎక్కడైనా వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడే వైర్లు ఉంటే సరిచేయాలని, ఎవరు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దేవరకొండ డివిజన్లో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనందున ఈ ప్రాంతంలోని మారుమూల, గిరిజన తండాల ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇక్కడి క్షేత్రస్థాయి సిబ్బంది క్షేత్రస్థాయిలో నే అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. మొంథ తుఫాన్ కారణంగా భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో 24 గంటలు పని చేసే విధంగా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజలు వర్షానికి సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 18004251442 కు తెలియజేయాలని ఆమె కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, భారీ వర్షాల సందర్భంగా ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

## సర్దార్ @150 యూనిటీ మార్చి పై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించిన ఎంపీ, రాజ్యసభ సభ సభ్యులు : కేసరి దేవ్ సిన్హా జ్వాల

**నల్లగొండ, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ని పురస్కరించుకొని ప్రజలలో జాతీయ సమైక్యతను దేశభక్తిని పెంపొందించేందుకుగాను, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ మరియు ఎన్ఎస్ఎస్ సహకారంతో “సర్దార్ ఏ150 యూనిట్ మార్చ్” ను నిర్వహించనున్నట్లు ఎంపీ, రాజ్యసభ సభ సభ్యులు కేసరి దేవ్ సిన్హా జ్వాల తెలిపారు. సర్దార్ఏ 150 యూనిటీ మార్చ్ కార్యక్రం అమలులో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జిగా నియమితులైన ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధికారుల తో కలిసి మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫెరెన్స్ లో మాట్లాడారు.సర్దార్ ఏ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యత,దేశభక్తి ని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర , జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 31 నుండి నవంబర్ 25 వరకు జిల్లాలలో విడతలవారీగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, సర్దార్ ఏ 150 యూనిటీ మార్చ్ లో 3 రోజుల పాదయాత్రను



జిల్లాస్థాయిలో నిర్వహించాలని, ప్రతి పాదయాత్ర 8 నుండి 10 కిలోమీటర్లు ఉండేలా చూడాలని, ఈ పాదయాత్రలో కనీసం 500 మంది యువత, విద్యార్థులు పాల్గొనేలా చూడాలని ఆయన అధికారులతో కోరారు. సర్దార్ఏ 150 యూనిటీ మార్చ్ నిర్వహించడంలో భాగంగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో కోర్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని , ఇందులో విశ్రాంత ఐఏఎస్ అధికారులు, జిల్లా యువజన సర్వీస్ల అధికారి, ఇతర అధికారులు, ప్రతినిధులతో కో-ఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ విషయమై ప్రతివారం జాతీయ స్థాయి కోర్ కమిటీ సమీక్షలు నిర్వహిస్తున్నదని వెల్లడించారు. సర్దార్ఏ150 యూనిటీ మార్చ్ కార్యక్రమాలలో భాగంగా జిల్లా స్థాయిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితానికి సంబంధించి ప్రజలకు యువతకు తెలియజేయడం, వైద్య శిబిరాల నిర్వహణ ,యోగ క్యాంపులు, ఎగ్జిబిషన్లు, వర్క్ షాప్ ల నిర్వహణ ,కళాశాల,పాఠశాల విద్యార్థులకు డిబేట్,ఇతర కాంపిటీషన్ల నిర్వహణ, వీధి నాటకాలు, ప్రచారాలు, స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలని ఆయన తెలిపారు. ఇందుకుగాను ఆయా జిల్లాల వారీగా రూట్ మ్యాప్ ను రూపొందించాలన్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో నవంబర్ 12, 13 తేదీలలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఇదే అంశంపై నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎంపీ, రాజ్యసభ సభ్యులు కేసరి దేవ్ సిన్హా జ్వాల ,కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో సర్దార్ ఏ 150 యూనిట్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అడిషనల్ ఎస్పీ రమేష్, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు ,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం డి అక్బర్ అలీ, జెడ్పి సీఈఓ శ్రీనివాసరావు, మెప్మా పిడి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి ,మై భారత్ ప్రతినిధి కృష్ణ ,సామాజిక కార్యకర్త సురేష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలు మహిళలపై, సమాజంపై పెరుగుతున్న ప్రభావం ఆందోళనకరం

ఐద్వా కేంద్ర నాయకురాలు పుణ్యవతి

**నల్లగొండ, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ మహాసభలు జరుగుతున్న సందర్భంగా నల్లగొండ యుటిఎఫ్ భవనంలో జరిగిన సెమినార్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర నాయకురాలు పుణ్యవతి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని క్రమంగా దెబ్బ తీస్తున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్తు పదార్థాల నియంత్రణలో పూర్తిగా వైఫల్యం చెందాయని, రాష్ట్రంలోని ప్రతి గల్లీ- గల్లీలో బెల్ట్ షాపులు పెరిగి మద్యం ఏరులై పారుతుంది విమర్శించారు.ఈ పరిస్థితుల్లో మంచినీళ్లు దొరకడం కష్ట మవుతున్నా, మద్యం మాత్రం ఎక్కడైనా సులభంగా లభిస్తోంది” అని పుణ్యవతి పేర్కొన్నారు. కల్తీ మద్యం కారణంగా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, డ్రగ్స్ నియంత్రణలో పోలీసులు, నిఘా సంస్థలు వైఫల్యం చెందాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే



కాకుండా ఇతర దేశాల నుండి పెద్ద ఎత్తున అక్రమంగా మత్తు పదార్థాలు రవాణా అవుతున్నా, పాలకులు దాన్ని అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్, గంజా వంటి మత్తు పదార్థాలను సేవించే యువకులు, పురుషులు మహిళలపై అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, చిన్నారుల నుండి వృద్ధుల వరకు అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. “యుక్తవయసులోనే వితంతువులుగా మారిన మహిళలు తమ పిల్లలను పోషించుకోలేక, అనేకమంది తప్పుడు మార్గాలకు వెళ్తున్న దుస్థితి ఉంది” అని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో విచ్చలవిడిగా అశ్లీలత వ్యాప్తి చెందుతూ యువతను దారి తప్పిస్తోందని, వీటిని అరికట్టేందుకు సమాజం బలమైన ఉద్యమాలతో ముందుకు రావలసిన అవసరం ఉందని పుణ్యవతి పిలుపునిచ్చారు.ఆమె తెలిపినదేమనగా ు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ స్థాయిలో మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నదని, ఇక గ్రామీణ స్థాయి వరకు ఈ ఉద్యమాలను విస్తరించి మహిళలను చైతన్యవంతులను చేసి, ఈ రుగ్మతలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, జిల్లా అధ్యక్షురాలు పల్లెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, పాతూరి గోవర్ధన ,ఎండి సుల్తానా, మేకల వర్ణ, ఉమా ,వెంకటమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీవర్షిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

## ఆత్మహత్యపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్

**హుస్నాబాద్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని శ్రీ వర్షిత కుటుంబాన్ని బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరామర్శించారు. స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి రాంపూర్ గ్రామానికి వెళ్లిన ఆయన, బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. "న్యాయం జరిగే వరకూ బీజేపీ అండగా ఉంటుంది. కుటుంబ సభ్యులు మనోధైర్యం కోల్పోకూడదు" అని ఆయన అన్నారు. వర్షిత ఆత్మహత్య ఘటనపై పాఠశాల ప్రిన్సిపల్‌పై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్లక్ష్యంగా మారింది. రెసిడెన్షియల్ పాఠశాలల్లో పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో



ప్రభుత్వం విఫలమైంది. ఫుడ్ పాయిజన్‌లు మామూలుగా మారిపోయాయి" అని ఆయన ఘాటుగా విమర్శించారు. విద్యాశాఖను చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ పాఠశాలల పట్ల చిత్తశుద్ధి లేదని, అదే కారణంగా ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. "ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడి, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలి" అని గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాముల కొమురయ్య, పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, ప్రధాన కార్యదర్శులు మోడెపు వినయ్, పారిపెల్లి కొండాల్ రెడ్డి, మ్రర్రి రవీందర్, చిదురాల శ్రీనివాస్ రెడ్డి, నరెడ్ల చైతన్య రెడ్డి, బండారి లావణ్య, మూదం మధు, గంగిశెట్టి ప్రభాకర్, మంతెన వరదేశ్వర్, గాలిబ్ కుమార్, బద్దం రాజీ రెడ్డి, బద్దం బాల్ రెడ్డి, ముద్రబోయిన గాలయ్య, తాళ్ళపల్లి శ్రీనివాస్, పంజాల రాజేష్, గణేష్, సల్పల ప్రశాంత్, బంటు నవీన్, బండారి శ్రీనివాస్, రావుల పున్నం, లాలు యాదవ్, పార్థీవ్ రెడ్డి, సాంబరాజు, తూర్పాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**-ప్రజల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని వలస సుభాష్ చంద్రబోస్ సూచన**



**హుస్నాబాద్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని అన్ని గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. కోహెడ మండల ప్రజానీకం వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసుకుంటూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కోరారురైతులు వ్యవసాయానికి వెళ్లే సమయంలో వాగులు, చెరువులు, కరెంట్ స్తంభాల వద్ద జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల రక్షణకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని వలస సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన సుడా చైర్మన్

**విద్యార్థినులకు భరోసా, లెక్చరర్లకు సూచనలు చేసిన నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో, కరీంనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో లెక్చరర్లు, సిబ్బందితో మాట్లాడిన ఆయన, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులతో మాట్లాడి భరోసా కల్పించారు. విద్యార్థులకు అందుబాటులో వసతులపై ప్రిన్సిపాల్ నిర్మలతో చర్చించి, అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినులు సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో మెయిన్ గేటు వద్ద ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినులు తెలియజేయగా, వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గేటు వద్ద పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భనలో డీఈఓ గంగాధర్, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న భీమారం మండల నాయకులు.

**మంచిర్యాల జిల్లా, భీమారం మండలం.అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామం లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఇందులో భీమారం మండల కేంద్రానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు పోడేటి రవి, నాయకులు భోయిని శ్రీనివాస్, నల్లాల రాజలింగు, కట్ట నాగరాజ్ , బోగే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రామగుండం సీపీ అంబర్ ఝా, మంచిర్యాల జిల్లా డీసీపీ భాస్కర్, శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

## ఉద్యోగుల అంకితభావమే శాఖ ప్రతిష్ఠకు బలమైన పునాది

**-ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ**
**- రాష్ట్ర ఆడిట్ సంచాలకులు మార్తినేని వెంకటేశ్వరరావు**



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు మార్తినేని వెంకటేశ్వరరావు కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికిన సందర్భంగా, శాలువాలు, పుష్పగుచ్ఛాలు, వేములవాడ స్వామివారి ప్రసాద కండువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా సంచాలకులు మాట్లాడుతూ, "ప్రతి ఉద్యోగి అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తే శాఖ ప్రతిష్ఠ పెరుగుతుంది. ఉద్యోగుల సమస్యలు ఎదురైనపుడు వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి మంచి గుర్తింపు తెచ్చే విధంగా ఉద్యోగులు పనిచేయాలని ఆయన సూచించారు. దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, "ఆన్‌లైన్ ఆడిట్ ద్వారా తెలంగాణను దేశానికే దిక్సూచి చేసిన ముందు చూపు ఉన్న నాయకుడు మా డైరెక్టర్. అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ, ఉద్యోగులను ప్రోత్సహిస్తూ, వారి కుటుంబాల్లో మనోధైర్యాన్ని నింపే మహోన్నత వ్యక్తి ఆయన" అని ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (వరంగల్) పోరిక రాము, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రాజ్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ రంజిత చికిలే, డిప్యూటీ డైరెక్టర్ వేణు మాధవరెడ్డి, జోయల్ త్రినాద్ దత్తు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, ఆడిట్ ఉద్యోగులు ముప్పిడి కిరణ్‌కుమార్, రాజేష్ భరద్వాజ్, ఏ.వి. రాజేశ్వరరావు, రామస్వామి, అల్లే శ్రీనివాస్, పవన్, వంశీ, లక్ష్మీకాంతయ్య, కృష్ణమోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పార్లమెంటుకు భారీగా కేంద్ర నిధులు

**851 కోట్ల ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు - బండి సంజయ్**




**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, దిశ కమిటీ చైర్మన్ బండి సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కరీంనగర్ -సిరిసిల్ల దిశ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 851 కోట్ల ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 15వేల సైకిళ్లు ఉచితంగా అందజేశామని, మరో 5వేల సైకిళ్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అంగన్వాడీ టీచర్లకు ఉచిత ట్యాబ్స్, ప్రభుత్వ ఆసుపత్రులకు ఆధునిక పరికరాలు, మందుల నిధులు అందిస్తున్నామని వెల్లడించారు. పీఎం శ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీ నిధులతో మంజూరైన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. గన్నేరువరం బ్రిడ్జి, కరీంనగర్ ఆర్‌ఓబి నిర్మాణం తదితర పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, కలెక్టర్లు పమేలా సత్పతి, గరీమా అగర్వాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అక్షరమా ఎవరి పక్షం..!?

అక్షరమా...!
నీవు ఎవరి పక్షమూ..!?
స్వార్థానికి తావు లేదు
మరణమనే మాటలేదు
నీ జననము శాశ్వతము
//అక్షరమా//
లలితకళల ప్రచారం అంబరంలో సంబరం
నవజీవన ఆరాటం పుస్తకంలో నీ రూపం
మస్తకంలో దాచినావు వెన్నెలవై విరిసినావు
//అక్షరమా//
గురువుల చేతిలో నీవు సుద్దముక్కవైనావు
నల్లబల్ల మీద నీవు అక్షరాలు నేర్పినావు
నీ తనువును నేలరాల్చి త్యాగజీవివైనావు
//అక్షరమా//
నవరసముల గూర్చినావు
పాఠకుల మెప్పించినావు
కవులను మేల్కొలిపినావు
రచనలు సృష్టించినావు....!
//అక్షరమా//
బడులు గుడులు అవుతున్నవి
గురువులు మత ఛాందసము
విజ్ఞాన శాస్త్రాలు అజ్ఞాత వాసాలు
ప్రశ్నించే తత్వాల గొంతునొక్కివేస్తున్నరు
అసమర్థుల పాలనలో అజ్ఞానమే విజ్ఞానం
//అక్షరమా//
నిత్యం కులగోడలు పెరుగవట్టె
వీధిలో మతమౌఢ్యం విస్తరించె
భిన్నత్వములో ఏకత్వము
మన ప్రజాస్వామ్య భారతం
కళ్ళముందే పతనమై పోతుంది
//అక్షరమా//
రక్షకభట నిలయములో
రెవెన్యూల రికార్డులలో
నల్లకోర్టు న్యాయవాదులలో
అనునిత్యము నలిగిపోతూ
జీవశ్చవమోలే జీవిస్తూ పోతున్నవ్
//అక్షరమా//
కాసుల కోసం నీవు అంగడిసరుకైనావు
దినపత్రికల్లో నీవు విషపుత్రిక వైనావు
న్యూసు పేపరంటేనే వేస్టు పేపరన్నారు
//అక్షరమా//
అక్షరాల ఆయుధమై భూకంపం సృష్టించు
అవినీతి మార్గాలను భూమార్గం పట్టించు
వాస్తావాలు వెలికితీసి శాసనాలు రక్షించు
స్వార్థపరుల కలం నుంచి విముక్తిని పొందమ్మ
అక్షర దివిటీలతో మసక చీకట్లను తొలగించు

డా"జోగు కృష్ణయ్య
రంగారెడ్డి జిల్లా



## నిరుద్యోగులకు లీడ్ ఇండియా శుభవార్త

**-ఉచిత శిక్షణతో ఉపాధి అవకాశాలు**
**- నవంబర్ 1, 2 తేదీల్లో కార్యక్రమం**

**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ యువతకు లీడ్ ఇండియా ఫౌండేషన్ శుభవార్త అందించింది. "ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్" కార్యక్రమం ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ బాధ్యులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, సింగమరాజులు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను నవంబర్ 1, 2 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. శిక్షణ పొందదలచిన నిరుద్యోగులు వాగేశ్వరి డిగ్రీ కాలేజీ, గీతా భవన్ ప్రక్కన ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు శిక్షణ సమన్వయకర్త శ్రీనివాస్ (8897174794)ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం




**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్ప్రెస్):** పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు యువకులు పాల్గొని రక్తదానం చేసి సేవా భావాన్ని చాటారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ డిఎస్పీ శ్రీనివాస్ నార్కల్, ఎస్‌బీసీఐ కనకయ్య, డిసిఆర్బిసిఐ ఉపేందర్ రావు, నాగర్‌కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి, ఆర్ఐ జగన్, ఎస్సై గోవర్ధన్, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, ప్రశాంత్, శివాజీ తదితరులు పాల్గొన్నారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.


# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి సూచనలు**



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ప్రభావంతో అక్టోబర్ 29, 30 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారుఅధికారులు తక్షణమే అప్రమత్తంగా ఉండాలని, నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, కల్వర్టులు దాటవద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు.

# హరీష్ రావును పరామర్శించిన సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును బుధవారం కోకాపేట నివాసంలో సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'సత్యనారాయణ రావు మానవత్వంతో, అంకితభావంతో సేవలందించిన ఆదర్శ ఉద్యోగి" అని చాడ పేర్కొన్నారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నేత చాడ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనలు**




**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.ధాన్యం నిల్వలపై టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని, తుఫాన్ తగ్గే వరకు వరి కోతలు నిలిపివేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం తరలింపు, ట్యాబ్ ఎంట్రీలు వేగవంతం చేయాలని సూచించారు. తడిసిన ధాన్యం పాడవకుండా వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని మంత్రి పేర్కొన్నారు.

# వరద నివారణ చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కవ్వ వేణుగోపాల్ రెడ్డి

**పొన్నం ప్రభాకర్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్**

---



**హుస్నాబాద్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో మెయిన్ రోడ్డు వరదలతో తీవ్రంగా దెబ్బతింటున్న నేపథ్యంలో, గత ఎన్నికల సమయంలో వర్షా కాలువ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికీ చర్యలు చేపట్టకపోవడంపై భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ధాన్యం వరద నీటిలో తడిసి నష్టపోతుండగా, మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లు అస్తవ్యస్తంగా ఉండటం, వ్యాపారుల దుకాణాలకు వరద నీరు చేరడం వంటి సమస్యలపై మంత్రి, మార్కెట్ పాలకవర్గం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అధికారులతో ఎస్టిమేషన్ వేయించి వరద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# పార్క్ స్థలాన్ని రక్షించిన హైడ్రా

**- ఫెన్సింగ్ ఏర్పాటు**


**కబ్జా ప్రయత్నం అడ్డుకుని ప్రభుత్వ భూమికి బోర్డు**




**నిజాంపేట్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెం.93, బృందావన్ కాలనీలో 20 గుంటల పార్క్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షిస్తూ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 2020లో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పార్కుగా గుర్తించిన స్థలాన్ని అభివృద్ధి చేయకపోవడంతో ఇటీవల ఆక్రమణ ప్రయత్నం జరిగింది.కాలనీవాసులు, ఆకుల సతీష్ టీం స్పందించి, బాచుపల్లి పోలీసుల ద్వారా కేసు నమోదు చేయించారు. ఆర్డీవో, కలెక్టర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమన్వయంతో ప్రభుత్వ స్థలంగా గుర్తించి స్కెచ్ ప్లాన్ రూపొందించారు. కమిషనర్ ఉత్తర్వుల మేరకు సీఐ నరేష్ ఆధ్వర్యంలో ఫెన్సింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆకుల సతీష్ మాట్లాడుతూ, "ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ నిధులు కేటాయించి పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభించాలి" అని కోరారు.కార్యక్రమంలో ఆకుల సతీష్, అరుణ్ రావు, చంద్రశేఖర్, కమేశ్వర్ రావు, మురళీధర్ రావు, శరత్ కుమార్, సుదీంద్ర వేర్ణా, సైలజా, కుసుమ, స్వాతి, కృష్ణ కుమార్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట ఆసుపత్రికి కేంద్ర మంత్రి బండి సంజయ్ పరికరాల అందజేత

**సి.ఎస్.ఆర్. నిధులతో రూ.1.50 కోట్లు విలువైన వైద్య పరికరాలు**



**జమ్మికుంట, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవల కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.1.50 కోట్ల సి.ఎస్.ఆర్. నిధులతో 15 రకాల వైద్య పరికరాలు అందజేశారు. ఈ నేపథ్యంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, ఆకుల రాజేందర్ తదితరులు ఆసుపత్రిని సందర్శించి సేవల స్థితిగతులను పరిశీలించారు.ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కార్యక్రమంలో రమణా రెడ్డి, బచ్చు శివకుమార్, గణేష్, రాజేష్ ఠాకుర్, తిరుపతి రెడ్డి, ప్రశాంత్, ముకుందా సుధాకర్, ఆకుల తిరుపతి, సమ్మయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదలకు విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి

**వెంటనే చెల్లించకపోతే రాష్ట్రాన్ని రణరంగంగా మారుస్తామని హెచ్చరిక**




**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల విడుదలకు డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. వర్షాన్ని లెక్కచేయకుండా సుమారు 2000 మంది విద్యార్థులు తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు.కలెక్టరేట్ ఎదుట "సీఎం డౌన్ డౌన్" నినాదాలతో గర్జించిన విద్యార్థులు, ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "విద్యార్థుల ఆర్తనాదాలను ప్రభుత్వం పట్టించుకోకపోతే బీఆర్ఎస్వి ముందుండి రాష్ట్రాన్ని రణరంగంగా మార్చుతుంది" అని అన్నారు.జిల్లా కోఆర్డినేటర్ ధ్యావ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం నిలవలేదని, ఇప్పుడు కూడా ప్రభుత్వం స్పందించకపోతే గద్దె దించే వరకు పోరాటం కొనసాగుతుంది" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రెడ్డవేణి మధు, బండారపు అజయ్ కుమార్ గౌడ్, చుక్కా శ్రీనివాస్, బొంకూరి మోహన్, చెన్నమల్ల చైతన్య, గంగాధర చందు, నారదాసు వసంత్, వడ్లకొండ పరుశురామ్, బండ వేణు యాదవ్, ధీరజ్, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఆలేటి శ్రీరామ్, మణి దీప్ నాయుడు, తరుణ్, కొమ్ము నరేష్, వొల్లాల శ్రీకాంత్, కైఫ్, సాయి తదితరులు పాల్గొన్నారు.పోలీసులు విద్యార్థులను అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. పలువురు నాయకులను అరెస్ట్ చేసి పీటీసీకి తరలించారు.

# షేక్పేట్ లో కాంగ్రెస్ పాదయాత్ర....

**పాల్గొన్న మంత్రి వివేక్, ఎమ్మెల్యే సంజీవ రెడ్డి...**



**షేక్పేట్, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షేక్ పెట్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ లో కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి, బూత్ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, షేక్పేట్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర లో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో జ్యోతి, సి.రాజు, రమేష్, రఘు, బాలు, బాబురావు, సంతోష్, నరేష్ తదితరులు పాల్గొనగా అధిక సంఖ్యలో వినాయక నగర్ వాసులు పాల్గొన్నారు.

# వర్షం కాదు అడ్డంకి.. ప్రజాసేవే మా పరమావధి...

**వర్షంలోనే మాగంటి సునీత ప్రచారం...**



**జూబ్లీహిల్స్, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రచారానికి, ప్రజలతో మమేకం కావటానికి వర్షం అడ్డంకి కాదని ఆత్మస్థైర్యం ముఖ్యమని నిరూపించారు జూబ్లీహిల్స్ బి ఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీత. బుధవారం శ్రీనగర్ కాలనీ డివిజన్ లోని వడ్డెర బస్తి, సుభాష్ నగర్ లలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ల సతీమణి అయేషా తో కలసి జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత గోపినాథ్ వర్షాన్ని లెక్క చేయకుండా గడపగడపకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. కాలనీవాసులు ఆత్మీయంగా పలకరించి గోపన్న సేవలను మర్చిపోమని, జూబ్లీహిల్స్ గడ్డపై బీఆర్ఎస్ జెండా తప్పకుండా ఎగిరి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "మన ఆహారం మన ఆరోగ్యం" కార్యక్రమం

**బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి**





**బొమ్మకల్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బిర్లా ఓపెన్ మైండ్స్ ఉన్నత పాఠశాలలో "మన ఆహారం - మన ఆరోగ్యం" కార్యక్రమాన్ని విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శిస్తూ, పౌష్టికాహార నమూనాలను స్వయంగా వండించి ప్రదర్శించారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ బబిత-విశ్వనాథన్ హాజరై విద్యార్థుల పనితీరును ప్రశంసించారు. తల్లిదండ్రుల సమక్షంలో ఉపాధ్యాయుల అభినందనలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



**జాతీయ రహదారి 765పై హైదరాబాద్ నుండి శ్రీశైలం వెళ్లే రహదారిలో కోత రాకపోకలు అంతరాయం.**

# ఒకే ఇంట్లో రెండుసార్లు దొంగతనం

- నిందితుడి నుంచి రూ.12 లక్షల బంగారం స్వాధీనం
-ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల దొంగతనానికి పాల్పడిన యువకుడు
- కరీంనగర్ పోలీసుల చాకచక్యంతో అరెస్ట్



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తీగలగుట్టపల్లి రెవెన్యూ కాలనీలో ఒకే ఇంట్లో ఫిబ్రవరి, జూన్ నెలల్లో రెండుసార్లు దొంగతనం చేసిన మహమ్మద్ ముస్తాక్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.12 లక్షల విలువైన 91 గ్రాముల బంగారం, రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్ 'డాష్ రమ్మీ'కు బానిసై అప్పుల్లో కూరుకుపోయిన ముస్తాక్, కోదాడ వద్ద బాయిలర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ దొంగతనాలకు పాల్పడ్డాడు. కిటికీ గ్రిల్ తొలగించి ఇంట్లోకి చొరబడిన అతడు, జూబ్లీ నగర్‌లో మరో ఇంట్లో టీవీ దొంగలించాడు. రైల్వే స్టేషన్ వద్ద పారిపోవడానికి ప్రయత్నించిన సమయంలో సీఐ నిరంజన్ రెడ్డి, సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్, ఎస్సై లక్ష్మారెడ్డి, హెచ్‌సీలు, పీసీలు కలిసి అరెస్ట్ చేశారు. సీపీ గౌష్ ఆలం, ఏసీపీ విజయ్ కుమార్ సిబ్బందిని అభినందించి నగదు రివార్డులు ప్రకటించారు.

# బండి సంజయ్‌ను కలిసిన యాదవ సంఘం ప్రతినిధులు

-మల్లికార్జున ఆలయం, సంఘం భవన అభివృద్ధికి వినతి



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మొగ్ధంపూర్ గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం మరియు యాదవ సంఘం భవన అభివృద్ధి కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు సోమవారం యాదవ సంఘం సొసైటీ అధ్యక్షుడు బండి మల్లన్న యాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాల్వ శ్రీనివాస్ యాదవ్, కూకట్ల రమేష్ యాదవ్, మారం సంపత్ యాదవ్, కూకట్ల సంజీవ్ యాదవ్, దాడి సంపత్ యాదవ్, కూకట్ల కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల వారోత్సవాల్లో మెగా రక్తదాన శిబిరం

160 యూనిట్ల రక్తం సేకరణ - సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 యూనిట్ల రక్తం సేకరించి ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ సెంటర్‌కు అందజేశారు. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, "1959 అక్టోబర్ 21న లధక్‌లో జరిగిన సంఘటనలో అమరవీరుల సేవలను స్మరించేందుకు ప్రతి సంవత్సరం వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రజల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నాం" అని తెలిపారు. తలసీమియా బాధితులకు రక్తదానం ఎంతో అవసరమని, సామాజిక బాధ్యతతో అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు ప్రణవ్

-గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి
-సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- కార్యకర్తలకు దిశానిర్దేశం



**హుజురాబాద్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "పల్లె పల్లెకు ప్రణవ్" కార్యక్రమాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మంగళవారం ఇల్లందకుంట మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6.28 లక్షల విలువైన 19 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల సమస్యలపై రాజీపడకుండా పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. "ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బియ్యం, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఉచిత బస్ రవాణా వంటి పథకాలు ప్రజల్లో విశ్వాసం కలిగించాయి. కోవర్ట్, గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా కష్టపడి పనిచేస్తే హుజురాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నేతలు, గ్రామాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్దార్ జయంతి సందర్భంగా ఐక్యత ర్యాలీ సన్నాహక సమావేశం

బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమానికి నేతల పిలుపు



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఐక్యత ర్యాలీ విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సౌత్ జోన్ (ఎస్‌బీఎస్) ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్, సౌత్ జోన్ అధ్యక్షురాలు గాయత్రి, బీజేపీ నాయకులు, వివిధ డివిజన్ల బూత్ సభ్యులు హాజరయ్యారు.

# మాకు వర్షం అడ్డంకి కాదు.. ప్రజల ఆశీర్వాదమే మా బలం..

-ఎడతెరిపి లేని వర్షం కూడా అడ్డు కాలేదు.....
-ప్రజల మనసు గెలుచుకున్న నవీన్ యాదవ్...





**జూబ్లీహిల్స్, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ, ఇమామ్‌గూడ, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో ఈరోజు కుండపోత వర్షం కురుస్తున్నా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్లారు. గొడుగు లేకుండా వర్షంలో తడుస్తూ ప్రతి ఇంటి వద్దకు చేరి ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి, వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న వారి సమస్యలు తెలుసుకున్నారు. నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపైన ఓటు వేసి వేయించి భారీ మెజార్టీతో గెలిపించి జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రజలందరూ తోడ్పడాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ డివిజన్ ఇన్చార్జి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్, కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్, రియాజ్, జయరాం, గొంటి సాయి యాదవ్, స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..లిబి

# ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం సహించం - బండి సంజయ్


దిశ సమీక్షలో అధికారులపై మండిపడ్డ కేంద్ర మంత్రి




**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమీక్ష సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "కేంద్రం భారీ నిధులు ఇస్తున్నా ప్రజలకు ఫలితం లేకపోతే ఎలా?" అని ప్రశ్నించారు. యూజీడీ పనులు, ఎంపీ లాడ్స్ గ్రౌండ్, ఆర్వోబీ నిర్మాణం, ఆసుపత్రుల మెడిసిన్ కొరత, గన్నేరువరం-బెజ్జంకి రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం, సోలార్ శాఖ పనితీరుపై మండిపడ్డారు. "ఇకపై కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి శాఖల వారీగా చర్యలు తీసుకోవాలి. ప్రతి నెల కేంద్ర పథకాల ప్రోగ్రెస్ రిపోర్ట్ మీడియాకు విడుదల చేయాలి" అని ఆదేశించారు. "తనఖా లేకుండా రూ.25 లక్షల లోపు రుణాలు ఇవ్వాలన్న కేంద్ర గైడ్‌లైన్స్ ఉన్నా బ్యాంకులు పట్టించుకోవడం లేదు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంటనే చర్యలు తీసుకోవాలి. మాట వినని బ్యాంకుల వద్ద డిపాజిట్లు వెనక్కు తీసుకోవాలి" అని హెచ్చరించారు. "ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధికారులు ట్రీట్‌మెంట్ తీసుకుంటే సామాన్యులకు భరోసా కలుగుతుంది. కరీంనగర్ కలెక్టర్ చేసిన విధంగా ఇతరులు కూడా ఫాలో కావాలి. ప్రజలను ఇబ్బంది పెట్టే వ్యవస్థను సహించం" అని స్పష్టం చేశారు.

# పంట నష్టంపై కేంద్ర మంత్రి ఆరా

- రైతులకు భరోసా కల్పించండి
-నష్ట నివారణలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం
- బండి సంజయ్ విమర్శ



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాతావరణ శాఖ హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్, సిరిసిల్ల కలెక్టర్లకు ఫోన్ చేసి వర్ష నష్టంపై ఆరా తీశారు. 'ధాన్యం కొట్టుకుపోయి రైతులు అల్లాడుతున్నారు. గత కొన్నేళ్లుగా పంట నష్టపోయినా పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. జూబ్లీహిల్స్ ఎన్నికలపై శ్రద్ధ చూపుతూ రైతులను ఆదుకోవడంలో విఫలమవుతోంది" అని మండిపడ్డారు. బాధిత ప్రాంతాల్లో పర్యటించి రైతులకు భరోసా కల్పించాలని కలెక్టర్లను కోరారు. "రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది" అని హెచ్చరించారు.

# దృఢ సంకల్పంతో చరిత్ర సృష్టించిన వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి

"శ్రీనివాస మిత్రులు" ఉద్యమం రెండేళ్లలో 28,000 మందికి విస్తరణ - ప్రపంచ రికార్డు




**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సేవా, సామాజిక, సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా "శ్రీనివాస మిత్రులు" ఉద్యమాన్ని ప్రారంభించిన వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, రెండేళ్లలో 48 గ్రూపుల ద్వారా 28,000 మంది శ్రీనివాసులను ఏకం చేశారు. కరీంనగర్‌లో జరిగిన రెండవ వార్షికోత్సవ మహాసభకు 2,586 మంది హాజరయ్యారు. 68 మంది మీడియా ప్రతినిధులు కవర్ చేసిన ఈ సభలో, తన తల్లిదండ్రుల జ్ఞాపకాలను గుర్తుచేస్తూ శ్రీనివాస్ రెడ్డి చేసిన హృదయాన్ని తాకే ప్రసంగం సభికులను మంత్రముగ్ధులను చేసింది. విమర్శించినవారికీ కృతజ్ఞతలు, సహకరించినవారికి పాదాభివందనాలు తెలుపుతూ ఆయన వినయాన్ని చాటారు. థలసేమియా బాధితులకు రక్తదానం ప్రధాన లక్ష్యంగా, రైతు నుండి ఎస్పీ వరకు అందరి మద్దతుతో ప్రపంచ రికార్డు నెలకొల్పారు. "అనవసరమైన మెసేజ్లు కాకుండా, సద్వినియోగ కార్యక్రమాలను పంచుకుందాం" అనే పిలుపు ఉద్యమంగా మారింది. కార్యక్రమంలో ప్రతి శ్రీనివాస మిత్రుడు పాదరక్షలు బయట వదిలి, తిరునామాలు ధరించి పాల్గొనడం విశేషం. ఈ వార్త ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ట్రెండింగ్ టాపిక్‌గా మారింది.

## అరుణాచల గిరి ప్రదక్షిణకు కార్తీక పౌర్ణమి స్పెషల్ బస్సులు

- హైదరాబాద్-2 డిపో ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తమిళనాడులోని పవిత్ర అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర కోసం కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్-2 డిపో, దిల్సుఖ్‌నగర్ నుండి ప్రత్యేక బస్సులు నడుపబడుతున్నాయి. నవంబర్ 3న రాత్రి 7:00 గంటలకు బయలుదేరే ఈ యాత్ర బస్సులు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటాయి. తిరుగు ప్రయాణం నవంబర్ 5న మధ్యాహ్నం అరుణాచలం నుండి ప్రారంభమై, నవంబర్ 6 ఉదయం 6:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఒక్క ప్రయాణికుడికి టికెట్ చార్జీ రూ.3900/-గా నిర్ణయించబడింది. ఈ పవిత్ర యాత్రలో పాల్గొనదలచిన వారు వెబ్‌సైట్ ద్వారా లేదా దగ్గరలోని ఏటీబీ ఏజెంట్ల వద్ద టికెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చు. యాత్ర వివరాల కోసం 9959444165, 9346559649, 9666350995, 7382838010, 9959226249 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ ప్రత్యేక యాత్రను విజయవంతంగా నిర్వహిస్తున్న డిపో మేనేజర్ ఎం. కరుణశ్రీ నేతృత్వంలో హైదరాబాద్-2 డిపో అధికారులు భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఏఎల్పి గని మేనేజర్‌కు బిఎంఎస్ నాయకుల సన్మానం



**రామగుండం, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ ఆర్‌జి త్రీ ఏరియా బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈరోజు ఏఎల్పి గని మేనేజర్ హస్తి పెంచలయ్యకు సన్మానం చేశారు. బ్రాంచ్ సెక్రటరీ రౌతు రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, గనిలో ఉన్న పలు సమస్యలపై మేనేజర్‌తో చర్చించి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ పున్నమనేని వేణుగోపాల్ రావు, ఆర్‌జి త్రీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అరుకల ప్రసాద్, ఏఎల్పి ఫిట్ కార్యదర్శి మీనుగు సంతోష్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శులు జాడి వెంకటేష్, చాట్ల వెంకటేష్ పాల్గొన్నారు. షిఫ్ట్ ఇన్‌చార్జీలు రాయవేణి రమేష్, భీమరి సంతోష్, హరీష్, రాజు, తిరుపతి, వెంకటసాయి తదితరులు హాజరయ్యారు.

## విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాలు సరిచూడాలి



**మంచిర్యాల, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలను సరిచూడాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి సూచించారు. ఎం.టి.ఎఫ్. ప్రొసీడింగ్‌లు జనరేట్ చేసి ట్రెజరీకి అప్‌లోడ్ చేసిన సమయంలో, విద్యార్థుల ఈ-పాస్ బ్యాంక్ ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా ఉండటంతో బిల్లులు అప్లోడ్ చేయడం సాధ్యపడటం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో, విద్యాసంస్థలు తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల బ్యాంకు వివరాలను తనిఖీ చేసి, అవసరమైన సవరణలు చేయాలని సూచించారుఎం.టి.ఎఫ్. బిల్లులు జారీ చేయడానికి, నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్ -5లో ఉన్న వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో పూర్తి వివరాలతో జాబితా తయారుచేసి, ఆయా కళాశాలల కవరింగ్ లేఖలతో సమర్పించాలని పేర్కొన్నారు.

# శ్రీ బుగులో జాతరకు ఏర్పాట్లు పూర్తి

### -సీసీఐ కేంద్రాల్లోనే పత్తి అమ్మాలి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**రేగొండ, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులో వచ్చే నెల 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరగనున్న శ్రీ బుగులోని వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గణపురం మండలం బుద్దారం గ్రామంలోని శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. రెండో తిరుపతిగా పేరుగాంచిన ఈ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. భక్తి, సేవ, సాంస్కృతిక పరంపరలను ప్రతిబింబించే ఈ జాతర ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే రూ.200 లక్షల నిధులు కేటాయించిందని, పనులు పూర్తికావచ్చాయని వెల్లడించారు. ఇదే రోజు చిట్యాల మండలం శాంతినగర్ శివారులోని ఆంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్ కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన పత్తికి కనీస మద్దతు ధర లభించాలంటే సీసీఐ కేంద్రాలకే తీసుకురావాలని సూచించారు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మితే నష్టపోతారని హెచ్చరించారు. తేమ లేకుండా పత్తిని సిద్ధం చేయాలని, కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవడం తప్పనిసరిగా పాటించాలన్నారు. రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు, భక్తులు, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు.

# చిన్నారుల అక్రమ దత్తతపై కఠిన చర్యలు తప్పవు




నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో సంచలనం సృష్టించిన పసికందుల అక్రమ అమ్మకాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు బృందాలు రంగంలోకి దిగాయి. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే పది రోజుల పసికందు, ఇరవై ఒక రోజుల బాబును సురక్షితంగా రక్షించి, ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించిన ఓ వైద్యుడిని కూడా అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి రెండు వేల రూపాయలు నగదు, ఏడు మొబైల్ ఫోన్లు, దత్తత ఒప్పంద పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.



మొదటి ఘటనలో నిర్మల ఆసుపత్రిలో ఆడబిడ్డను రెండు లక్షల మూడువేల రూపాయలకు, రెండవ ఘటనలో గుర్రంపోడు మండలంలో పుట్టిన బాబును నాలుగు లక్షల ఐదు వేల రూపాయలకు విక్రయించినట్లు పోలీసులు వెల్లడించారు. విక్రయానంతరం నిందితుల నివాసాల్లో మెరుపు దాడులు నిర్వహించి, చిన్నారులను శిశు గృహానికి తరలించారు. నిందితులందరికి న్యాయపరమైన రిమాండ్ విధించారు. అక్రమంగా మైనర్ పిల్లల అమ్మకం, కొనుగోలు, దత్తత వంటి విషయాలు తెలిసిన వెంటనే పోలీస్ స్టేషన్ లేదా సమాజ సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇట్టి కేసును అత్యంత చాకచక్యంగా పరిష్కరించి, రెండు పసికందులను కేవలం 24 గంటల్లోనే సురక్షితంగా కాపాడిన బృందం పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కేసులో విశేషంగా సేవలందించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సమాజ సంక్షేమ అధికారి కృష్ణవేణి, బాల సంక్షేమ అధికారి గణేష్, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, ఎస్ఐలు సైదులు, గోపాలరావు, రబ్బాని, షకీల్, కిరణ్, అంజి, ఫారుక్, సత్యనారాయణ, పర్యవేక్షకురాలు సరస్వతి, సమాజ సంక్షేమ శాఖ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయాలి

### పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

**నల్లగొండ ,అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిజెఐ బి ఆర్ గవాయి పై జరిగిన దాడిని నిరసిస్తూ నవంబర్ 1న హైదరాబాదు ప్రదర్శనలో పాల్గొనాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ బుధవారం నల్గొండలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. సిజెఐ బి ఆర్ గవాయిపై జరిగిన దాడిని కుల వివక్ష దాడిగా, న్యాయవ్యవస్థ పై జరిగిన దాడిగా, రాజ్యాంగం పై జరిగిన దాడిగా అభివర్ణించారు. సుప్రీంకోర్టులో దళిత సిజెఐ బి ఆర్ గవాయి పై దాడి జరిగి మూడు వారాలు గడిచినా దాడి చేసిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ,దాడీ వెనుక ఉన్న వారిని ఎందుకు శిక్షించలేదని ,ఈ దాడిని దేశం మొత్తం ఖండించిందని మేధావర్గం ఖండించినా వ్యవస్థ మౌనంగా ఉండడానికి కారణం ఏమిటని సుప్రీంకోర్టు వెంటనే దాడి చేసిన వారిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని కోర్టులో నినాదాలు ఇచ్చిన అది




కోర్టు ధిక్కరణ అవుతుందని న్యాయవ్యవస్థ సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయవచ్చని తెలిపారు ఝూర?ండ్ లో జడ్జి పై ఒక లాయర్ వాగ్ వివాదానికి దిగితే వెంటనే సుమోటోగా కేసు నమోదు చేశారని కానీ గవాయి విషయంలో అది జరగలేదని వ్యవస్థలో దళితులు ఏ స్థానంలో ఉన్న సంపూర్ణ న్యాయం జరగడం లేదని పోలీసులు గాని న్యాయ, వ్యవస్థ గాని, మానవ హక్కుల కమిషన్ గాని ఎందుకు సుమోటోగా కేసు తీసుకోలేదని ప్రశ్నించారు
మొన్న జరిగిన రౌడీషీటర్ రియాజ్ విషయాని ప్రసావిస్తూ అతని ఎన్కౌంటర్ ని ప్రశ్నిస్తూ వెంటనే మానవ హక్కుల కమిషన్ టమోటాగా తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు సిజెఐ మీద జరిగిన దాడిని ఎందుకు మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకుంటలేదని ప్రశ్నించారు భారతదేశానికి ఏ కులమైనా ఏ మతమైనా రాజ్యాంగం ప్రతిపాదిక కావాలి అన్ని మతాలు భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి దేశభక్తులు ద్వేష ద్రోహులు చర్చ జరిగితే రాజ్యాంగాన్ని గౌరవించిన వారి దేశభక్తులని తెలిపారు.

# పేదింటి అమ్మాయి పెళ్లికి ఆర్థిక సాయం

### నందివనపర్తిలో మాజీ సర్పంచ్ రాజునాయక్ చేయూత

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యాచారం మండలం నందివనపర్తి గ్రామానికి చెందిన అవనీల ధనమ్మ, ముత్యాలు దంపతుల రెండవ కుమార్తె వివాహం నిశ్చయమైన సందర్భంగా, గ్రామ మాజీ సర్పంచ్ డాక్టర్ రాజునాయక్ ఆర్థిక సాయం అందించారు. వివాహానికి ముందు వారు మర్యాదపూర్వకంగా కలవగా, 20 వేల రూపాయల నగదు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా



రాజునాయక్ మాట్లాడుతూ, "నిరుపేద ఆడబిడ్డలకు వీఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. గ్రామంలో ఎవరికైనా ఆపద వచ్చినా సహాయం చేయడంలో ముందుంటాను" అని తెలిపారు. అవనీల ధనమ్మ, ముత్యాలు దంపతులు స్పందిస్తూ, "రక్త సంబంధీకులు కూడా చేయని సాయం చేశారు. ఏమిచ్చినా ఈ రుణం తీర్చుకోలేనిది" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పగిల్ల శ్రీనివాస్, కొండాపురం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత కరీంనగర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత ఈనెల 31, నవంబర్ 1 తేదీలలో కరీంనగర్ జిల్లాలో పలు మండలాల్లో పర్యటించనున్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎల్. రూప్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం, ఆమె ముందుగా హుజురాబాద్, మానకొండూరు, చొప్పదండి మండలాల్లో పర్యటించి, కరీంనగర్ పట్టణంలో రాత్రి హాల్ట్ చేస్తారు. తదుపరి రోజు, వివిధ రంగాల్లో నిపుణులైన మేధావులు, విద్యావంతులు, వైద్యులు తదితరులతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా, తీసుకున్న నిర్ణయాల నేపథ్యాన్ని వివరించనున్నారు. ముఖ్యంగా, అంబేద్కర్ విగ్రహం, పూలే విగ్రహం అసెంబ్లీలో



ఏర్పాటు, బీసీ రిజర్వేషన్లు, 72 కులాలతో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సమావేశం వంటి అంశాలపై చర్చ జరుగుతుంది. ఈ చర్చల ఫలితంగా ప్రభుత్వం తక్షణమే బిల్లు ప్రవేశపెట్టడం, జి.ఓ విడుదల చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, పర్యటన సందర్భంగా స్థానిక మేధావులు, విద్యావంతులు, వైద్యులు తదితరులు కవితను కలవనున్నారు. తగిన సలహాలు, సూచనలు తీసుకొని జాగృతిని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లలో కదలిక రావడానికి కవిత కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో పర్యటన విజయవంతం కావాలని జిల్లా నాయకత్వం ఆకాంక్షిస్తోంది. జాగృతిలో కలిసి పని చేయడానికి పలువురు ముందుకు వస్తున్నారని, తమను సంప్రదిస్తున్నారని తెలిపారు.

# కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

**బట్టల షాపులో చెలరేగిన మంటలు.. పక్క షాపులు దగ్ధం**



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ వద్ద బుధవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కపిల డ్రెస్సెస్ షోరూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పక్కనున్న షాపులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కపిల డ్రెస్సెస్‌తో పాటు వినాయక ఎంటర్‌ప్రైజెస్, ఫొటోగ్రఫీ షాపు, కెనాన్ ఫొటోగ్రఫీ దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మంటలను ఆర్పేందుకు సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించారు. ఈ ప్రమాదం వల్ల కపిల దుకాణం యాజమాన్యానికి భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.

# భూ ఆక్రమణ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: జీవన్ రెడ్డి

**జగిత్యాల, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భూ ఆక్రమణపై బాధ్యతగల పౌరుడిగా స్పందించాల్సిన అవసరం ఏర్పడిందని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వే నంబర్ 138లోని 20 గుంటల స్థలంపై వివాదం నెలకొనగా, మున్సిపల్ వేసిన బాలే వీరేశం సబ్‌కమిటీకి కిబాల పత్రాలు సమర్పించలేదని తెలిపారు. యాజమాన్య హక్కులను కోర్టు ధృవీకరించలేదని, 2008 నుంచి సివిల్ కోర్టును ఆశ్రయించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. 1952లో భూ కేటాయింపు జరిగిందని చెబుతూ, 1958లో జిరాక్స్ పత్రాలు మాత్రమే సమర్పించారని, కిబాల పత్రం 1975 వరకు ఎందుకు రాలేదో సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. కిబాల పేరుతో ఇతర వినియోగాలకు భూమిని వాడటం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. 2004లో మున్సిపల్ కౌన్సిల్ చేసిన



తీర్మానం ప్రకారం, పెట్రోల్, డీజిల్, కిరోసిన్ పంపు కోసం మినహా మిగిలిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించిందని గుర్తు చేశారు. మున్సిపల్ తీర్మానం 140ను రద్దు చేసే అధికారం ప్రభుత్వానిదేనని కోర్టు స్పష్టంచేసిందన్నారు. పిటిషనర్ రిట్‌లో రెవెన్యూ రికార్డుల ప్రకారం దారం వీరమల్లయ్య కబ్జాలో ఉన్నారని పేర్కొన్నా, పట్టాదారు కాలమ్‌లో పేరు నమోదు కాలేదని కోర్టు వ్యాఖ్యానించిందన్నారు. యాజమాన్య హక్కులు లేనప్పుడు కబ్జాలో కొనసాగడం నైతికంగా సరైంది కాదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో హైడ్రా ఏర్పాటు చేశారని, అదే విధంగా జిల్లాల్లో కూడా విస్తరించాలని కోరారు. చెరువులు, కుంటలపై ఆక్రమణల వల్ల మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటోందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధిగా ఆక్రమణదారులు ఎంతటి వారైనా ప్రభుత్వం వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. దేవాలయాల ఆస్తులు, ధరూర్‌లో ప్రభుత్వ భూములు కాపాడిన తృప్తి తనకు ఉందన్నారు. నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వామిగా ఉన్నానని చెప్పారు. ఇంతకాలం ఈ భూ ఆక్రమణ తన దృష్టికి రాలేదని, ఇటీవలే తెలిసిన నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న జనరేటర్ తొలగించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజల అనుమానాలు తొలగించాల్సిన బాధ్యత మంచాల కృష్ణపై ఉందని పేర్కొన్నారు. యాజమాన్య హక్కులు మున్సిపాలిటీకి ఉన్నందున చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన ఆక్రమణదారులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

# పోలీసు అమరవీరుల స్మారకార్థం రక్తదాన శిబిరం




**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోలీసు సంస్మరణ వారోత్సవాలు జెండా దినోత్సవం -2025 సందర్భంగా, కరీంనగర్ ఆదాయపు పన్ను కార్యాలయం సమీపంలోని చైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐవైఎస్ఓ టీమ్ ఇండియా, ఆక్ట్ ఇండియా, వైఐఎం, ఎస్ఎల్ఆర్ ఎస్ఎల్ఆర్, కరీంనగర్ సైకిల్ క్లబ్, చైతన్య డిగ్రీ కళాశాల సభ్యులు కలిసి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సమన్వయంతో నిర్వహించారు. మధ్యాహ్నం 1:30 గంటలకు పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం రక్తదానం చేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అడ్మిన్ ప్రతాపగిరి వెంకటరమణ విరాళం క్యాంప్‌ను ప్రారంభించారు. చైతన్య గ్రూప్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి ప్రారంభించిన అనంతరం, రక్తదాతలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ శిబిరంలో దాదాపు 20 మంది సభ్యులు తమ విలువైన రక్తాన్ని దానం చేసి కార్యక్రమానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డా. వీరా రెడ్డి (సూపరింటెండెంట్), ముద్దసాని సాయి చైతన్య రెడ్డి (అదనపు డైరెక్టర్), జగన్ మోహన్ రెడ్డి (డీన్), శ్రీనివాస్ (ఏఓ), శ్రీమపాల్ రెడ్డి (మాజీ సైనికుడు), ఘన్‌షామ్ ఓజా (ఎఫ్ఎఫ్‌పీసీఈఓ), అన్మోల్ ఓజా (అదనపు అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, కోశాధికారి), పిఆర్ఓ అడ్డె వెంకటేష్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మధు, జలందర్, సంతో తదితరులు పాల్గొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్ని ప్రతాపగిరి వెంకటరమణ ప్రశంసించారు. పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల హృదయాలను తాకింది.

# రేపటి నుండి జూబ్లీహిల్స్‌లో కేటీఆర్ రోడ్ షోలు ప్రారంభం



**జూబ్లీహిల్స్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 9 వరకు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించనున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా, ఆయన వివిధ డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 31న షేక్‌పేట్‌లో ప్రారంభమయ్యే రోడ్ షోలు, నవంబర్ 1న రెహమత్ నగర్, నవంబర్ 2న యూసుఫ్‌గూడ, నవంబర్ 3న బోరబండ, నవంబర్ 4న సోమాజిగూడ, నవంబర్ 5న వెంకట్రావు నగర్, నవంబర్ 6న ఎర్రగడ్డ డివిజన్లలో కొనసాగుతాయి. అనంతరం నవంబర్ 8న షేక్‌పేట్, యూసుఫ్‌గూడ, రెహమత్ నగర్ ప్రాంతాల్లో రోడ్ షోలు నిర్వహించనున్నారు. ప్రచార కార్యక్రమం నవంబర్ 9న షేక్‌పేట్ నుంచి బోరబండ వరకు నిర్వహించే బైక్ ర్యాలీతో ముగియనుంది. నియోజకవర్గంలోని ప్రజలతో ప్రత్యక్షంగా కలుసుకునే ఈ ప్రచారం, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపనుంది.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలకు బీజేపీ మండల శాఖ సన్నద్ధం



**గంభీరావుపేట, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర, జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో ఈరోజు మండల సమావేశం నిర్వహించారు. 2025 సంవత్సరంలో భారత ఉక్కు మనిషిగా, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని, ఈనెల 31న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సర్దార్ 150 యూనిటీ మార్చ్ మరియు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గంభీరావుపేట మండల నాయకులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోడె రమేశ్ పిలుపునిచ్చారు. సమావేశంలో మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వజిత్ హుస్సేన్, మండల ఉపాధ్యక్షులు మోహన్, బిద్ది నర్సింలు, కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు డాక్టర్ సత్యనారాయణ, దేవేందర్ యాదవ్, నర్సింలు, శ్రీనివాస్ చారి, స్వామి భాస్కర్, నాయక్ స్వామి, రాజేష్, నవీన్, హరీష్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు కింద అంగన్వాడీ కేంద్రం.. చిన్నారులకు ఇబ్బందులు



**మనోహరాబాద్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మనోహరాబాద్ మండలంలోని తుపాకులపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం కోసం ప్రత్యేక భవనం లేకపోవడంతో, స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్టు కిందే విద్యా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. చిన్నారులు చదువు, భోజనం, ఆటలు అన్నీ ఓ చెట్టు నీడలోనే సాగుతున్నాయి. వాతావరణ మార్పులు, వర్షాలు, ఉష్ణోగ్రతల వల్ల పిల్లలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యం, భద్రత, విద్యా ప్రమాణాల దృష్ట్యా అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# బీఆర్ఎస్‌కు గుడ్‌బై

**- వెంగళరావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు**




**వెంగళరావు నగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ డివిజన్‌లోని యాదగిరి నగర్ 144వ బూత్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మారిన వారికి కండువా కప్పి, అధికారికంగా ఆహ్వానం పలికిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, యాదగిరి నగర్ ఇంచార్జ్‌గా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు గోపాల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తల చేరికతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఎన్నికల ప్రచార వేగాన్ని పెంచేందుకు ఈ చేరికలు బలంగా నిలుస్తాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# నృత్య పోటీల్లో చంద్రగిరి సస్య ప్రతిభా ప్రదర్శన

**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక పారమిత ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని చంద్రగిరి సస్య రాష్ట్రస్థాయి "సోలో వెస్టర్న్" నృత్య పోటీల్లో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. "సన్ షైన్ కల్చరల్ అకాడమీ" కరీంనగర్ ఆధ్వర్యంలో ఇటీవల కళాభారతి వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 60 బృందాలు పాల్గొన్నాయి. అద్భుత నృత్య ప్రదర్శనతో మూడవ స్థానాన్ని సాధించిన చంద్రగిరి సస్యను పారమిత పాఠశాలల అధినేత డా. ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్ రావు, వినోద రావు, వి.యు.యం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజి, ప్రశాంత్, సమన్వయకర్త శ్రీనాథ్, డ్యాన్స్ మాస్టర్ భీష్మరాజ్ తదితరులు అభినందించారువిద్యార్థుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడంలో పాఠశాల పాత్రను కొనియాడారు. ఈ విజయంతో విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.





మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి మరణించగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.

# ఐఓక్యూఎం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులకు బండి సంజయ్ అభినందన



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయస్థాయి మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ ఎగ్జామ్ (ఐఓక్యూఎం)లో ఉత్తీర్ణత సాధించిన శ్రీ చైతన్య స్కూల్ చింతకుంట బ్రాంచ్ విద్యార్థులను కేంద్ర హెూం సహాయ మంత్రి బండి సంజయ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయస్థాయిలో వేలాది మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నా, కొంతమందికే ఎంపిక అవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. పట్టుదలతో చదివి అసాధ్యాన్ని సాధ్యంగా మార్చిన విద్యార్థులు భవిష్యత్తులో జరిగే ప్రతి పోటీ పరీక్షలో ముందుండాలని ఆకాంక్షించారు.విద్యార్థుల ప్రతిభను వెలికితీసి శిక్షణ ఇచ్చిన మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజకుమార్ ఆచార్య మాట్లాడుతూ, జాతీయస్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో కరీంనగర్ బ్రాంచ్‌కు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ విజయానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందించిన సహకారం కీలకమైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన 113 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగా, కరీంనగర్ చింతకుంట బ్రాంచ్‌కు చెందిన 9 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో మెరిశారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా ప్రతిభ పరీక్షలకు మార్గదర్శకాలు రూపొందించిన డైరెక్టర్ సీమా, జీఎం నాగేంద్ర, డైరెక్టర్లు శ్రీ విద్యా, శ్రీధర్, అఖిల భారత అకాడమిక్ కోఆర్డినేటర్ బివి సతీష్, రాష్ట్ర కోఆర్డినేటర్ జయరాజు తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కరీంనగర్ జోన్ ఏజీఎం ఎం.రాజు, అకాడమీ కోఆర్డినేటర్ ప్రవీణ్ పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో జూరల్ అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, ఐపీఎల్ ఇంచార్జ్ శ్రీకాంత్ రెడ్డి, సి ఇంచార్జ్ జైవర్ధన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రిప్టో మోసానికి బలైన ప్రభుత్వ వైద్యుడు



**కరీంనగర్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో మోసానికి గురై, తీవ్ర ఆర్థిక ఒత్తిడితో ప్రభుత్వ వైద్యుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీంనగర్ నగరంలో కలకలం రేపుతోంది. ప్రతిమ ఆసుపత్రిలో అనస్తీషియా వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ ఎంపటి శ్రీనివాస్ మత్తు ఇంజక్షన్ తీసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు.మంకమ్మతోటకు చెందిన శ్రీనివాస్ గతంలో చొప్పదండి మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశాడు. ఆయన భార్య విప్లవశ్రీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. తరచూ బ్యాంక్ అధికారులు ఇంటికి రావడం, అప్పుల ఒత్తిడి పెరగడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని విప్లవశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.స్నేహితులు కరుణాకర్, కిరణ్, గణేష్‌లతో కలిసి మెటా ఫండ్‌లో పెట్టుబడి పెట్టిన శ్రీనివాస్, కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుని వారికి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. రుణాలు తిరిగి చెల్లించలేకపోవడం, స్నేహితులు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడం, బ్యాంక్ ఉద్యోగుల వేధింపులు తీవ్రంగా ప్రభావితం చేశాయని బంధువులు తెలిపారు. వైద్యవృత్తిలో ఉన్న కారణంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందిన శ్రీనివాస్, గత పదేళ్లుగా ఈఎంఐలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లినట్లు సమాచారం. సుమారు మూడు కోట్ల రూపాయల వరకు అప్పులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పలురకాల వ్యాపారాల్లో భాగస్వామిగా మారిన శ్రీనివాస్, మోసానికి గురై చివరికి ప్రాణాలు కోల్పోయినట్లు బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎస్ఐ అజ్మీరా రమేష్ ధైర్య సాహసాలకు సెల్యూట్



**కొండమల్లేపల్లి అక్టోబర్ 29. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** పోలీసులు అంటేనే కొంతమంది అదో విధంగా భావిస్తారు కానీ శాంతి భద్రతల పర్యవేక్షణలో బిజీ జీవితాలను గడుపుతూ సమాజంలో పోలీసులు పాత్ర చాలా ముఖ్యమైనది ఒకవైపు తమ కుటుంబాన్ని చూసుకుంటూ, ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారు. అక్రమాలపై ఉక్కుపాదం మోపుతూ రాత్రి పగలు అనక సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణాలు పణంగా పెట్టి శాంతి భద్రతల పరిరక్షణ కొరకు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు. ఖాకీలంటే కఠినమైన మనసే కాదు, మంచి మనస్సు కూడా కలిగిన వారమని నిరూపించిన కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీర రమేష్ . కొండమల్లేపల్లి మండలంలో భారీ వర్షాలు సైతం లెక్కచేయకుండా ప్రజల శ్రేయస్సు కోసం గత రెండు రోజుల నుండి గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, నీటిపారుదల శాఖ అధికారులతో పాటు పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొండమల్లేపల్లి పట్టణంతో పాటు, గౌరుకుంట తండా, బాపూజీ నగర్, ఉప్పవాగు, దోనియాల, చిన్న అడిశర్లపల్లి తదితర గ్రామాలలో భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రజలకు మూగజీవులకు ఇబ్బందులు తలెత్తకుండా తన సాహసోపేత నిర్ణయాలతో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఇబ్బందులు రాకుండా భారీ వర్షాలతో వచ్చిన నీళ్లను తాను తడుస్తూ దగ్గర ఉండి తగు సూచనలు చేస్తూ భారీ వర్షాలతో వచ్చిన నీళ్లను దోనియాల చెరువులోకి మళ్ళించి భారీ ప్రమాదం నుండి ప్రజలను కాపాడారు. గత పది ఏళ్ల తర్వాత నిండిన నల్లకుంట నిండి ప్రమాద స్థాయికి చేరుకుందని గ్రహించి అకస్మాత్తుగా నల్లకుంట తెగితే చాలా ప్రాణ ఆస్తి నష్టం జరుగుతుందని భావించిన ఎస్ఐ అజ్మీర రమేష్ రంగంలోకి దిగి నల్లకుంట నీళ్లను అలుగుద్వారా బయటికి పంపించారు. అదేవిధంగా తాత్కాలికంగా బైపాస్ నుండి కుంటలోకి నీళ్లు రాకుండా బైపాస్ ద్వారా చెరువులోకి వెళ్లేటట్టు మార్గం సుగమమం చేశారు. దీంతో చుట్టుపక్కల ప్రజలు ప్రాణాలు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ అజ్మీర రమేష్ విరోచిత ధైర్యసహసాలకు ప్రజలు ముక్తకంఠంతో అభినందిస్తూ ఎస్ఐ సాహసోపేత నిర్ణయాలకు అభినందిస్తున్నారు. ఇలాంటి ముందుచూపు, ప్రజల భద్రతపై ప్రత్యేక చొరవ చూపిన రియల్ హీరోగా ఎస్ఐ అజ్మీరా రమేష్ ప్రజలు కీర్తిస్తున్నారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న డిండి ప్రాజెక్టు

-డిండి ప్రాజెక్టులోకి మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు.
-డిండి పరిసర లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
- డిండి ప్రాజెక్ట్ మత్స్యకార సొసైటీ చైర్మన్ మేకల కాశన్న.



**డిండి అక్టోబర్ 29. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** మొంత తుఫాన్ కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నాగర్ కర్నూల్ నల్గొండ జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా డిండి ప్రాజెక్టులోకి భారీ వరద ఎగువ నుండి రావడంతో ప్రాజెక్టు ఉగ్రరూపం దాల్చి డ్యాం పై నుండి మీటర్ ఎత్తులో ప్రవహిస్తూ నీరు బ్రిడ్జి పైకి వచ్చే విధంగా ప్రవహిస్తుందని డిండి గ్రామ ప్రజలు ప్రాజెక్టు లోతట్టు పరిసర గ్రామాల ప్రజలు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని డిండి ప్రాజెక్ట్ మత్స్యకార సొసైటీ చైర్మన్ మేకల కాశన్న తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఇప్పటికే మొంతా తుఫాను ప్రభావంతో నిండి ప్రాజెక్టు భారీ ఎత్తున డ్యాం పోస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు సంబంధిత అధికారులు డిండి ప్రాజెక్టు డ్యాం వద్ద ప్రజలను ఎప్పటికప్పుడు ఉండే విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు సెల్ఫీలు ఫోటోలు దిగి ప్రమాదానికి గురై అవకాశం ఉందని అధికారులు పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి 765 డిండి ప్రాజెక్ట్ సమీపంలో రైట్ కెనాల్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు వరద ప్రవాహాన్ని కి తట్టుకోలేక బ్రిడ్జి కొంతమేరకు కుంగిపోవడం జరిగిందని శ్రీశైలం హైదరాబాద్ మార్గంలో వెళ్లే ప్రయాణికులు రాకపోకలను బందు చేసుకోవాలని ఆయన కోరారు ఇప్పటికే ఉదయం నుండి మండలంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న బ్రిడ్జిల వద్ద రహదారులపై నీరు వెళ్లడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఏర్పడిన నీటి ప్రవాహాల వల్ల ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా పోలీసులు మండల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారని ప్రజలకు ప్రమాదం జరగకుండా అలర్ట్ చేసిన పోలీసులకు ఈ సందర్భంగా కాశన్న ధన్యవాదాలు తెలిపారు.

# నిండుకుండల దేవరకొండ కోర్టు

-భారీ వరదల మధ్యలోనూ విధులకు హాజరైన కోర్టు సిబ్బంది



**దేవరకొండ, అక్టోబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అధిక వర్షాలతో దేవరకొండ పట్టణం నిండుకుండలా మారిన సందర్భంలోనూ, న్యాయ విధుల పట్ల నిబద్ధతను చాటుతూ కోర్టు సిబ్బంది విధులకు హాజరయ్యారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా శ్రీ కె.వి.ఎస్. హరీష్ బాబు, తీవ్ర వర్షపాతం మధ్యలోనూ కోర్టుకు వచ్చి విధులను నిర్వర్తించారు. ఆయనతో పాటు కోర్టు సిబ్బంది కూడా తమ బాధ్యతలను నిర్విరామంగా కొనసాగించారు.ప్రజాసేవ పట్ల వీరి అంకితభావం న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పెంపొందించేదిగా నిలిచింది. వరదలతో రహదారులు ముంచెత్తినప్పటికీ, న్యాయ సేవలు నిలిపివేయకుండా కొనసాగించడం ప్రశంసనీయమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# వంగూరు మండలంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటన

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సమీక్ష, ప్రజలకు భరోసా





**వంగూరు, అక్టోబర్ 29 (నిలగిరి ఎక్ప్రెస్):** తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వంగూరు మండల కేంద్రం పూర్తిగా జలమయం అయింది. ఎమ్మార్వో కార్యాలయం, ఎంపీటీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ సహా అనేక ప్రభుత్వ కార్యాలయాలు నీట మునిగాయిఈ పరిస్థితిని గమనించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారు వెంటనే వంగూరు చేరుకుని ముంపు ప్రాంతాల్లో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆందోళనను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. “ప్రజలు భయపడవద్దు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది. అప్రమత్తంగా ఉండాలి” అని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మురళీమోహన్, ఎంపీడీవో, ఎస్సై మహేష్, వంగూరు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గాఫూర్, జనార్దన్, శివశంకర్, శేఖర్, శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గోనవోని చెరువు సందర్శించిన మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని గోనవోని చెరువు ఈ ఏడాది సమృద్ధిగా నిండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వరుణదేవుడు కరుణించడంతో మండలంలోని కుంటలు, వాగులు, చెరువులు నిండుకుండలుగా మారాయి. గతంలో 2009లో దివంగత ముఖ్యమంత్రి డా. వైయస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో నిండిన ఈ చెరువు, అనంతర కాలంలో ఎండిపోయి కనిపించేది. అయితే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో చెరువు మళ్లీ నిండిపోగా, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం సింగిల్ విండో డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మట్ట వెంకటయ్య గౌడ్ చెరువును సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఆయనతో పాటు ఎండి రషీద్, కొయ్యల పుల్లయ్య, గుద్దటి కిష్టాలు, మట్ట భరత్, చిమ్ముల నందు, షీలా రవి, నాప వెంకటయ్య, మహేష్, ఇరిగేషన్ శాఖ ఏఈ మల్లీయా, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్‌తో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

**నిరంతర వర్షాల నేపథ్యంలో కలెక్టర్ బాధావత్ సంతోష్ సమీక్ష**



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని సూచిస్తూ, జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం రాత్రి జిల్లాలో గత వర్షపాతంతో పోలిస్తే అత్యధిక వర్షం నమోదైనట్లు కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మున్సిపల్, పోలీస్, ఫైర్, వ్యవసాయ, విద్యా శాఖలతో పాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులతో సమీక్ష నిర్వహించారు. కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల్లో మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం సాగునీటి కాలువలు, చెరువుల కట్టలు తెగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా కాలువలు తెగితే వెంటనే ఇసుక సంచులతో అడ్డుకట్ట వేసేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమాచారాన్ని సంబంధిత శాఖలకు వెంటనే చేరవేయాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో గర్భిణీల ఆరోగ్య పరిస్థితులపై వైద్య సిబ్బంది నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. కాజ్‌వేలు, చెరువులు, శిథిల గృహాలు, ట్రాఫిక్ అంతరాయాలు వంటి ప్రాంతాల్లో అధికారులు మానిటరింగ్ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అవసరమని పేర్కొన్నారు. గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, చెరువుల వద్దకు, కాలువల వద్దకు వెళ్లకుండా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలకు సెలవులు ప్రకటించాలని, శిథిల గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టరాదని డిఈఓను ఆదేశించారు. శిథిల ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లోకి తరలించి మూలిక వసతులు కల్పించాలని మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులకు సూచించారు. వాగులు, వంకల పైనుండి ప్రవహిస్తున్న దారుల వెంట ప్రజలు దాటకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ శాఖ 24 గంటలు సేవలు అందిస్తూ, పిడుగుల ప్రమాదం నివారణకు చెట్ల కింద ఉండకుండా ప్రజలకు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. GPOs, VRA లు, పంచాయతీ సెక్రటరీలు తమ గ్రామాల్లో తిరిగి ప్రజలను అప్రమత్తం చేయాలని, మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల రక్షణకు కృషి చేయాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాధావత్ సంతోష్ స్పష్టం చేశారు.

# ఓటర్ల కోసం హెల్ప్‌లైన్లు..

**జాతీయ స్థాయితో పాటు అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు**

**ఎన్నికల సంఘం వెల్లడి**




**న్యూఢిల్లీ– అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటర్ల నమోదు, ఓటింగ్‌కు సంబంధించి పౌరుల సందేహాలు, సమస్యలు, ఇబ్బందులు పరిష్కరించడానికి భారత ఎన్నికల సంఘం జాతీయ వోటర్ హెల్ప్‌లైన్ సహా 36 రాష్ట్రాలు/యూటీల్లో హెల్ప్‌లైన్లను బుధవారం నుంచి క్రియాశీలం చేసింది. అలాగే ఈసీఐనెట్ యాప్ ద్వారా పౌరులు తమ సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)తో నేరుగా సంప్రదించేందుకు వీలుగా 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ' సౌకర్యాన్ని కూడా ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల సమాచారం, అభిప్రాయాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం బీఎల్‌వోతో బుక్–ఏ కాల్, హెల్ప్‌లైన్ నెంబర్ 1950 సౌకర్యాలను ఉపయోగించుకోవాలనిఈసీ విజ్ఞప్తి చేసింది. ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా పౌరులు సంబంధిత ఎన్నికల అధికారులతో సంప్రదించవచ్చునని తెలిపింది.

# కాంగ్రెస్ సభలో బంగ్లాదేశ్ జాతీయ గీతాలాపన!

**అస్సాం ప్రభుత్వం విచారణ**



**న్యూఢిల్లీ– అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అస్సాంలోని శ్రీభూమి జిల్లా బరాక్ వ్యాలీలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన సభ వివాదాస్పదంగా మారింది. కాంగ్రెస్ నాయకుడు బిధుభూషణ్‌దాస్ ఆధ్వర్యంలో జరిగిన సభలో బంగ్లాదేశ్ జాతీయ గీతమైన 'అమర్ సోనార్ బంగ్లా'ను ఆలపించడం వివాదానికి కారణమైంది. దీనిపై స్పందించిన అధికార బీజేపీ ఇది భారత ఖ్యాతిని అవమానించడమేనని అభిప్రాయం వ్యక్తంచేసింది. ఇటీవల అస్సాం సహా భారత ఈశాన్య రాష్ట్రాలను తమ దేశంలో భాగంగా చూపుతూ బంగ్లాదేశ్ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో తాజా వివాదం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# రష్యా చమురు ట్యాంకర్ యూటర్న్


**భారత్ వస్తుండగా ఆకస్మిక పరిణామం**



**న్యూఢిల్లీ– అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రష్యా ముడి చమురుతో భారత్‌కు పయనమైన ఓ ఆయిల్ ట్యాంకర్ బాల్టిక్ సముద్రంలో అర్ధాంతరంగా వెనుకకు మరలింది. దీంతో భారత్, రష్యా మధ్య చమురు వాణిజ్యం నిలిచిపోయినట్లు వెలువడుతున్న వార్తలకు బలం చేకూర్చినట్లు అయింది. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా తాజా ఆంక్షల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అయితే రాయితీ ధరలకు లభిస్తున్న రష్యా చమురుపై భారీగా ఆధారపడిన భారతీయ రిఫైనరీలు తాజా పరిణామంతో అనిశ్చితికి లోనయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. రష్యాలోని ప్రిమోరస్క్ పోర్టు నుంచి దాదాపు 7.30 లక్షల బ్యారెళ్ల ముడి చమురుతోబయల్దేరిన ఫ్యూరియా అనే ట్యాంకర్ గుజరాత్‌లోని సిక్కా పోర్టుకు చేరుకోవలసి ఉంది. డెన్మార్క్, జర్మనీ మధ్య ఫెహమార్న్ బెల్ట్ చేరుకున్న అనంతరం హఠాత్తుగా వెనక్కు మరలిన ఆ ట్యాంకర్ ఈజిప్టులోని ఓ పోర్టు వైపు దిశ మార్చుకున్నట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.

# గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

**100 మందికిపైగా మృతి!**



**న్యూఢిల్లీ అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంలో హమాస్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. బుధవారం గాజాపై వైమానిక దాడులకు దిగింది. దీంతో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, మృతుల్లో 35 మంది చిన్నారులు ఉన్నారని గాజా అధికారిక వర్గాలు తెలిపాయి. గాజా సివిల్ డిఫెన్స్ అధికార ప్రతినిధి మహమూద్ బస్సాల్ మాట్లాడుతూ, 'కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రస్థాయిలో ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. వైమానిక దాడుల కారణంగా గాజాలో అత్యంత దయనీయ, భయానక పరిస్థితులు నెలకొన్నాయి. కేవలం 12 గంటల్లో 101 మంది ప్రాణాల్ని ఇజ్రాయెల్ బలితీసుకుంది' అని అన్నారు. దీనిపై ఇజ్రాయెల్ రక్షణమంత్రి స్పందిస్తూ, 'ఇజ్రాయెల్ సైనికులపై హమాస్ దాడి చేసింది. దాంతో శక్తివంతమైన దాడులతో సమాధానమిచ్చాం' అని అన్నారు.

# భారత్‌లో స్వేచ్ఛగా జీవిస్తున్నా..

**బంగ్లా మాజీ ప్రధాని హసీనా**



**న్యూఢిల్లీ– అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బంగ్లాదేశ్‌లో 2026లో జరిగే జాతీయ ఎన్నికల్లో తమ అవామీ లీగ్ పార్టీని కనుక పోటీ చేయడానికి అనుమతించకపోతే తమ పార్టీ మద్దతుదారులందరూ ఎన్నికలను బహిష్కరిస్తారని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా స్పష్టంచేశారు. గత ఏడాది అంతర్యుద్ధం కారణంగా ఏర్పడిన తిరుగుబాటుతో పదవీచ్యుతురాలై భారత్ వచ్చి ఆశ్రయం పొందుతున్న హసీనా వివిధ అంశాలపై బుధవారం తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారత రాజధానిలో తాను స్వేచ్ఛగా జీవిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో బంగ్లాదేశ్ రాజకీయాల్లో అధికారం చేపట్టడానికి అయినా, ప్రతిపక్ష పాత్ర పోషించడానికి అయినా తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

# కెనడాలో బిష్ణోయ్ గ్యాంగ్ ఆగడాలు..

**పంజాబ్ సింగర్ ఇంటిపై కాల్పులు**




**న్యూఢిల్లీ– అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కెనడా లో గ్యాంగ్ స్టర్ బిష్ణోయ్ గ్యాంగ్ ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. అక్కడ భారత సంతతి వ్యక్తులపై వరుస దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల ఆ దేశంలో భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త దర్శన్ సింగ్ సహాసి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఇది తమ పనేఅని బిష్ణోయ్ గ్యాంగ్ తాజాగా ప్రకటించింది. బిష్ణోయ్ గ్యాంగ్‌లో సభ్యుడైన గోల్డీ ధిల్లాన్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. తాజాగా పంజాబ్ గాయకుడి ఇంటిపై బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులకు తెగబడింది. కెనడాలోని పంజాబీ గాయకుడు చాని నట్టన్ ఇంటి వెలుపల కాల్పులు జరిగాయి. ఇది తమ పనేఅని గోల్డీ వెల్లడించారు. గాయకుడు సర్దార్ ఖేరాతో నట్టన్‌కు పెరుగుతున్న సాన్నిహిత్యం కారణంగానే అతడిని లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించారు. ఖేరాతో కలిసి పనిచేసే ఏ గాయకుడినైనా తాము లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. ఇక కాల్పుల ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లొంగిపోయిన 51 మంది మావోయిస్టులు



**కొత్తగూడెం– అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : మావోల ఉద్యమం అంత్యదశకు చేరుకోవడంతో ఆ పార్టీలో లొంగుబాట్లు కూడా జోరందుకున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలీసు అధికారుల ఎదుట బుధవారం 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న 9 మంది మహిళలు సహా మొత్తం 51 మంది మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు లొంగిపోయారని ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు. వీరిపై రూ.66 లక్షల రివార్డులు ఉన్నట్లు ప్రకటించారు.

# శ్రీశైలం రూట్ మార్గదర్శక సూచనలు

**మొంథా తుఫాన్ ప్రభావంతో మారిన ప్రయాణ మార్గం**

**నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ సూచన**




**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మొంథా తుఫాన్ ప్రభావంతో అచ్చంపేట, అమ్రాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా శ్రీశైలం హైవేపై నీరు పొంగిపొర్లుతూ రోడ్డు కోతకు గురైంది. భక్తుల భద్రత దృష్టిలో ఉంచుకుని, నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖ ప్రయాణ మార్గాన్ని మార్చి సూచనలు జారీ చేసింది. హైదరాబాద్ నుండి శ్రీశైలం వెళ్తున్న భక్తులు కల్వకుర్తి సమీపంలో కొట్రగేట్ వద్ద నుంచి నేరుగా కల్వకుర్తి పట్టణంలోకి వచ్చి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద ఎడమవైపు మలుపు తీసుకుని మంతటి ఎక్స్‌రోడ్ వరకు చేరాలి. అక్కడి నుంచి ఎడమవైపు తిరిగి తెలకపల్లి చేరుకుని, వివేకానంద విగ్రహం వద్ద కుడివైపు మలుపు తీసుకొని లింగాలకు వెళ్లాలి. లింగాల నుంచి బల్మూరు, అచ్చంపేట మీదుగా రంగాపూర్ గుండా శ్రీశైలం చేరుకోవచ్చు. అదే విధంగా శ్రీశైలం నుండి హైదరాబాద్ వెళ్తున్న భక్తులు రంగాపూర్ గుండా అచ్చంపేట చేరుకుని, అక్కడి నుంచి లింగాల ఎక్స్‌రోడ్ మీదుగా బల్మూరు, లింగాల, తెలకపల్లి మీదుగా మంతటి ఎక్స్‌రోడ్ చేరాలి. అక్కడ కుడివైపు మలుపు తీసుకుని కల్వకుర్తి మీదుగా హైదరాబాద్ చేరుకోవచ్చు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా భక్తులు ఈ మార్గాన్ని అనుసరించాలని, ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రయాణించాలన్నది జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి.